



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 12 సంచిక : 343 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | గురువారం 13 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :343 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | THU 13 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం



- అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజాప్రతినిధులకు జగన్ పిలుపు
- డీఎస్సీ అవకతవకలపై ప్రభుత్వం స్పందించడం లేదన్న బొత్స
- 40 శాతం ఓట్లు వచ్చిన పార్టీకి ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వరని ప్రశ్న

పెన్ పవర్ డెస్క్:రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై గళమెత్తి, కూటమి ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన శాసనసభా పక్ష సమావేశంలో సభ్యులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం సమావేశంలో చర్చించిన కీలక అంశాలను శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మీడియాకు వెల్లడించారు.డీఎస్సీ నియామకాల

- మిగతా 2లో

## జగన్‌కు ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి..
## ఆధారాలతో చర్చకు మేం సిద్ధం



- మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టిన అనిత
- రోడ్డు మీద నిలబడి ఆరోపణలు చేయడం కాదంటూ జగన్ కు కౌంటర్
- సభకు వచ్చి ఆధారాలు చూపాలని సవాల్

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ కు ధైర్యముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని, రోడ్ల మీద నిలబడి చేసే ఆరోపణలకు సభలో ఆధారాలు చూపాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సవాల్ విసిరారు. శాసనసభకు రాకుండా బయట విమర్శలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆమె అన్నారు. బుధవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతులు స్వీకరించిన అనంతరం

- మిగతా 2లో



## డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

### సీఎం చంద్రబాబు ఆదేశాలు

- చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం
- పారిశ్రామిక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాల చెల్లింపు విధానంలో కీలక మార్పు
- ఈ విధానం ద్వారా పారదర్శకతను పెంచడమే లక్ష్యం
- నిధుల వినియోగాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చన్న సీఎం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాల చెల్లింపు విధానంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది డిసెంబరు నుంచి పరిశ్రమలకు ఇచ్చే అన్ని రకాల ప్రోత్సాహకాలను (ఇన్సెంటివ్స్) నేరుగా ప్రత్యేక ఎస్క్రో ఖాతాల్లో జమ చేసేలా చర్యలు చేపట్టాలని

- మిగతా 2లో

# ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు..

- ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు
- పార్టీ ప్రజాప్రతినిధులకు జగన్ దిశానిర్దేశం
- శాసనమండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఎమ్మెల్సీలకు సూచన
- ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల సమస్యలపై గళమెత్తాలని ఆదేశం
- ప్రజా సమస్యలను మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళతానన్న జగన్



పెన్ పవర్ డెస్క్: ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తమ గొంతు నొక్కేందుకే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శాసనసభను దాదాపు రెండేళ్లుగా బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలి వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు.
ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం నాడు ఆయన పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన పార్టీ అయిన వైసీపీకి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇష్టపడటం లేదని, అందుకే ప్రజా సమస్యలను మీడియా ద్వారానే ప్రజల దృష్టికి తీసుకెళ్లి నాణేనికి మరోవైపు చూపిస్తానని స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీకి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజావాణిని బలంగా వినిపించాలని జగన్ సూచించారు. “గత 74 రోజులుగా డీఎస్సీ కుంభకోణంపై 10 రకాల నిరసనలు చేపట్టాం. పేపర్ లీకేజీ, ఔట్‌సోర్సింగ్ కుంభకోణాలు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు, ప్రభుత్వ ఉత్తర్వుల మార్పు వంటి అంశాలను ఆధారాలతో సహా బయటపెట్టాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశాం” అని జగన్

- మిగతా 2లో



## చంద్రబాబు ఒక విజనరీ లీడర్

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- నిజమైన అభివృద్ధికి చంద్రబాబు చిరునామా అన్న ద్రౌపది ముర్ము
- ఏపీ అభివృద్ధికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంస
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళుతున్నారన్న రాష్ట్రపతి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా దక్షతపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు కురిపించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని కొనియాడిన ఆమె... రాష్ట్రంలో నిజమైన అభివృద్ధికి ఆయనే అసలైన చిరునామా

- మిగతా 2లో



## రాజ్యసభను కుదిపేసిన “లుంగీవాలా” వివాదం

- తనను లుంగీవాలా అని పిలిచారంటూ బీజేపీ ఎంపీపై సీపీఎం ఎంపీ ఫిర్యాదు
- ఆ వ్యాఖ్యలు తాను చేయలేదని, బ్రిట్టాస్ అబద్ధం చెబుతున్నారని సుస్మితా దేవ్ ఖండన
- ఒకరిపై మరొకరు హక్కుల ఉల్లంఘన నోటీసులు దాఖలు

పెన్ పవర్ డెస్క్:రాజ్యసభలో బుధవారం ‘లుంగీవాలా’ వివాదం తీవ్ర దుమారం రేపింది. తనను ఉద్దేశించి బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ ఈ పదాన్ని ఉపయోగించారని కేరళకు చెందిన సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు.సోమవారం నాడు సభలో తాను ఆదాయపు పన్ను సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సమయంలో, పంచె కట్టుకుని ఉన్న తనను చూసి వెనుక సీటులో కూర్చున్న సుస్మితా దేవ్ పదేపదే ‘లుంగీవాలా’ అని సంబోధించారని బ్రిట్టాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది దక్షిణాది సంస్కృతిని, మలయాళీలను అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్వించదగ్గ భారతీయుడినని,

- మిగతా 2లో

## కంపెనీల్లో మహిళా బాస్‌లు చాలా తక్కువ.. పార్లమెంటులో కేంద్రం వెల్లడి

- దేశంలోని టాప్ 500 లిస్టెడ్ కంపెనీల్లో కేవలం 9 మందే మహిళా సీఈవోలు
- ఇదే కంపెనీల్లో 25 మంది మహిళా మేనేజింగ్ డైరెక్టర్లు
- మహిళా డైరెక్టర్లను నియమించని సంస్థలకు రూ.71 లక్షల జరిమానా
- మొత్తం కంపెనీల్లో మాత్రం 11 లక్షల మందికి పైగా మహిళా డైరెక్టర్లు



పెన్ పవర్ డెస్క్:భారత్‌లోని అగ్రశ్రేణి లిస్టెడ్ కంపెనీల్లో అత్యున్నత కార్యనిర్వాహక పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. టర్నోవర్ ప్రాతిపదికన టాప్ 500 కంపెనీల్లో కేవలం 9 మంది మహిళలు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా (సీఈవో), 25 మంది మేనేజింగ్ డైరెక్టర్లుగా (ఎండీ) బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది.

- మిగతా 2లో




## భారత్‌లో డిజిటల్ విప్లవం.. డిజిలాకర్‌కు 72 కోట్లు, ఉమంగ్‌కు 11 కోట్ల యూజర్లు!

- డిజిలాకర్ యూజర్ల సంఖ్య 72.43 కోట్లు దాటిందని కేంద్రం వెల్లడి
- గత మూడేళ్లలో ఉమంగ్ ప్లాట్‌ఫామ్‌పై దాదాపు 798 కోట్ల లావాదేవీలు
- డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పౌర సేవలు మరింత సులభతరం
- గ్రామ పంచాయతీ స్థాయిలో 4 లక్షలకు పైగా కామన్ సర్వీస్ సెంటర్లు
- మహిళల ఆధ్వర్యంలో 70,000కు పైగా సీఎస్‌సీల నిర్వహణ

- మిగతా 2లో

## జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన

- జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరమన్న ప్రధాని నరేంద్ర మోదీ
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచన
- గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలంటూ యువతకు హితవు
- మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ సభలో వ్యాఖ్యలు




పెన్ పవర్ డెస్క్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటి తరం యువతకు (జెన్–జీ) పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ ‘ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్’ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.
రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. “షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్” (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# రోగి ప్రాణమా... ప్రైవేట్ ఆసుపత్రి బిల్లా?

రూమ్ చార్జీలపై పార్లమెంటరీ కమిటీ సిఫార్సులు ఒక హెచ్చరిక మాత్రమే... అసలు ప్రశ్న 'మెడికల్ మాఫియా'ను ఎవరు కట్టడి చేస్తారు?

ఆసుపత్రి గుమ్మం తొక్కిన క్షణం నుంచి సామాన్యుడి గుండెల్లో ఒకటే భయం... రోగం నయం అవుతుందా? లేక బిల్లు కట్టేలోపే ఆస్తి కరిగిపోతుందా?

దేశంలో పెరుగుతున్న వైద్య ఖర్చులపై పార్లమెంటరీ స్థాయీ సంఘం చేసిన తాజా సిఫార్సులు ఈ భయానికి అద్దం పడుతున్నాయి. మెట్రో నగరాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల రూమ్ చార్జీలను సమీపంలోని 3-స్టార్ హోటళ్ల సగటు అద్దెకు మించకుండా పరిమితం చేయాలని కమిటీ సూచించడం చిన్న విషయం కాదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సగటు చికిత్స వ్యయం రూ.6,631గా ఉంటే, ప్రైవేటు ఆసుపత్రుల్లో అదే రూ.50,508కు చేరుతున్నదన్న గణాంకం వైద్య రంగంలో పెరిగిన వ్యాపారీకరణకు స్పష్టమైన సంకేతం.

**అయితే... రూమ్ చార్జీలను పరిమితం చేస్తేనే సమస్య పరిష్కారమవుతుందా?**

ఖచ్చితంగా కాదు.

రోగి ఆసుపత్రిలోకి అడుగుపెట్టిన దగ్గర నుంచి బిల్లు ఎలా పెరుగుతోంది?

అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి తీసుకెళ్లిన రోగి కుటుంబానికి ముందుగా అడిగే ప్రశ్న చాలాసార్లు "ఎంత ఖర్చవుతుంది?" అన్నదే. పరిస్థితి తీవ్రంగా ఉందని చెబుతూ వెంటనే అడ్మిషన్. ఆ తర్వాత వరుసగా రక్త పరీక్షలు, స్కాన్లు, ఇతర డయాగ్నస్టిక్ పరీక్షలు. ప్రతి పరీక్షకు ప్రత్యేక బిల్లు. ఒక వైద్యుడి అభిప్రాయం తర్వాత మరో స్పెషలిస్టు. అవసరమని చెబుతూ మరిన్ని పరీక్షలు. చివరకు డిశ్చార్జ్ సమయానికి కుటుంబం ఊహించని స్థాయిలో బిల్లు చేతిలో పెట్టడం...

ఇదంతా ప్రతి ఆసుపత్రిలో జరుగుతోందని చెప్పలేం. వేలాది వైద్యులు, ఆసుపత్రులు నిబద్ధతతో సేవలందిస్తున్నాయి. కానీ కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం సేవ నుంచి వ్యాపార మోడల్‌గా మారుతున్నదన్న ప్రజల ఆందోళనను మాత్రం విస్మరించలేం.

'ప్యాకేజీ' పేరుతో పేదవాడి జేబుకు గండివైద్యరంగంలో పారదర్శకత అత్యంత అవసరం. ఒక ఆపరేషన్‌కు ఎంత? డాక్టర్ ఫీజు ఎంత? ఆసుపత్రి సేవా రుసుము ఎంత? మందుల ఖర్చు ఎంత? పరీక్షల ఖర్చు ఎంత? గది అద్దె ఎంత? నర్సింగ్ ఛార్జీలు ఎంత?

ఇవన్నీ ముందుగానే స్పష్టంగా చెప్పే వ్యవస్థ ఉండాలి.

రోగి ఆసుపత్రిలో ఉన్నప్పుడు అతని బలహీనతను ఆసుపత్రి బిల్లింగ్ వ్యవస్థకు బలంగా మార్చకూడదు. అత్యవసర వైద్యం కోసం వచ్చిన కుటుంబం బేరసారాలు చేసే పరిస్థితిలో ఉండదు. ఆ సమయంలో ఆసుపత్రి చెప్పిందే నిజమని నమ్మాల్సి వస్తుంది. ఈ పరిస్థితినే దుర్వినియోగం చేసే వ్యవస్థ ఎక్కడైనా ఉంటే దానిని నియంత్రించడం ప్రభుత్వ బాధ్యత.

**మెడికల్ మాఫియా అంటే కేవలం ఆసుపత్రి కాదు... ఒక వ్యవస్థ**

ప్రైవేటు వైద్య రంగంపై విమర్శలు వచ్చిన ప్రతిసారీ మొత్తం వైద్య వృత్తినే నిందించడం సరికాదు. అసలు సమస్య ఎక్కడుందో గుర్తించాలి. అనవసర పరీక్షలు, అవసరానికి మించిన చికిత్సలు, అధిక ధరల మందులు, రోగికి తెలియని అదనపు ఛార్జీలు, స్పష్టత లేని ప్యాకేజీలు, ముందస్తు అంచనా లేకుండా పెరుగుతున్న బిల్లులు-ఇలాంటి అంశాలపై కఠినమైన నియంత్రణ అవసరం. వైద్యం వ్యాపారం కావచ్చు... కానీ రోగి నిస్సహాయత మాత్రం వ్యాపార వస్తువు కాకూడదు.

**హోటల్‌తో ఆసుపత్రిని పోల్చడం సరైనదా?**

ఆసుపత్రి యాజమాన్యాలు చెబుతున్న అభ్యంతరంలో కూడా కొంత వాస్తవం ఉంది. హోటల్ గది, ఆసుపత్రి గది ఒకటి కాదు. ఆసుపత్రిలో నర్సింగ్, వైద్య పర్యవేక్షణ, అత్యవసర సదుపాయాలు, పరిశుభ్రత, వైద్య పరికరాలు వంటి అదనపు సేవలు ఉంటాయి. కానీ అదే సమయంలో ఈ వాదన పేరుతో అనియంత్రిత రూమ్ చార్జీలకు తలుపులు తెరిచి ఉంచడం కూడా సమర్థనీయం కాదు. కాబట్టి పరిష్కారం హోటల్ అద్దెను యథాతథంగా అమలు చేయడం మాత్రమే కాకుండా, ఆసుపత్రుల రూమ్ కేటగిరీలకు శాస్త్రీయమైన ధరల ప్రమాణాలు రూపొందించడం కావాలి.

**ఇంకా ముఖ్యమైనది-పరీక్షల ధరల నియంత్రణ**

పార్లమెంటరీ కమిటీ సూచించిన మరో అంశం అత్యంత కీలకం. చికిత్సతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షల ధరలను కూడా నియంత్రించేందుకు చట్టబద్ధమైన వ్యవస్థ అవసరం.

ఒకే నగరంలో, ఒకే రకమైన పరీక్షకు వేర్వేరు ఆసుపత్రుల్లో భారీగా ధరల తేడా ఉంటే సామాన్యుడు ఎవరిని నమ్మాలి?ప్రతి ముఖ్యమైన పరీక్షకు రాష్ట్రాల వారీగా లేదా ప్రాంతాల వారీగా గరిష్ఠ ధరల పరిమితి ఉండాలి.ఆ ధరలు ఆసుపత్రులలో, వెబ్‌సైట్లలో, బిల్లింగ్ కౌంటర్లలో స్పష్టంగా కనిపించేలా చేయాలి.

**'ఎంత ఖర్చవుతుంది?' అని అడిగే హక్కు ప్రతి రోగిదే**

చికిత్స ప్రారంభించే ముందు సాధ్యమైనంతవరకు అంచనా వ్యయాన్ని రోగి కుటుంబానికి తెలియజేయాలి. చికిత్స మధ్యలో అనూహ్య మార్పులు వచ్చినప్పుడు వాటి కారణాన్ని, అదనపు ఖర్చును వివరించాలి.

రోగి కుటుంబానికి వివరమైన, అర్థమయ్యే బిల్లు ఇవ్వడం తప్పనిసరి కావాలి.

అదే సమయంలో అత్యవసర పరిస్థితుల్లో ముందుగా డబ్బు కట్టలేదనే కారణంతో ప్రాణరక్షక చికిత్సను నిరాకరించే పరిస్థితులు రాకుండా కూడా బలమైన నిబంధనలు అవసరం.

**ఆరోగ్యం హక్కా? లేక కొనగలిగిన వస్తువా?**

**ఈ ప్రశ్న ఇప్పుడు దేశం ముందుంది.**

డబ్బున్నవాడికి అత్యుత్తమ వైద్యం... డబ్బులేని వాడికి అప్పు చేసి వైద్యం... అప్పు కూడా దొరకని వాడికి విధి నిర్ణయం-ఇలాంటి పరిస్థితి ఒక సంక్షేమ రాజ్యానికి గర్వకారణం కాదు.ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం, వైద్య సిబ్బందిని పెంచడం, అత్యాధునిక పరికరాలు అందించడం, మందులు అందుబాటులో ఉంచడం వంటి చర్యలతో పాటు ప్రైవేటు వైద్య రంగంలో పారదర్శకత, ధరల నియంత్రణ, రోగి హక్కుల పరిరక్షణ కూడా సమాంతరంగా జరగాలి. పార్లమెంటరీ కమిటీ సిఫార్సులు ఒక మంచి ప్రారంభం. కానీ అవి కాగితాలకే పరిమితమైతే ప్రయోజనం లేదు.ఆసుపత్రి బిల్లు చూసి రోగి కుటుంబం మరోసారి అనారోగ్యానికి గురికాకుండా ఉండే రోజే నిజమైన వైద్య సంస్కరణలకు నాంది.

**ప్రాణాలను కాపాడాల్సిన వైద్య వ్యవస్థ...**

ప్రాణం మీద పడే ఆర్థిక భారానికి కారణం కాకూడదు.ప్రైవేటు ఆసుపత్రులపై ఆరోపణలు చేయడం సులభం.వ్యవస్థను ప్రక్షాళన చేయడం కష్టం.అందుకే ఇప్పుడు ప్రభుత్వానికి కావాల్సింది కేవలం సిఫార్సుల అమలు కాదు-వైద్యం పేరుతో జరిగే దోపిడీకి అడ్డుకట్ట వేసే సమగ్ర చట్టబద్ధ వ్యవస్థ.

రోగి ముందుగా... లాభం తర్వాత.

వైద్యం సేవగా నిలవాలి... వ్యాపార దందాగా మారకూడదు.

# ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు..

- మొదటి పేజి తరువాయి

వివరించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలకు సంబంధించి 13 త్రైమాసికాల బకాయిలు పేరుకుపోయాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ అన్నారు. సుమారు రూ. 9,100 కోట్లు, రూ. 3,300 కోట్ల బకాయిలు ఉండగా, ప్రభుత్వం కేవలం రూ. 2,900 కోట్లు విడుదల చేసిందని విమర్శించారు. ఈ అంశాన్ని మండలిలో లేవనెత్తి చర్చకు పట్టుబట్టాలని ఎమ్మెల్సీలకు సూచించారు.

రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, పంటలకు నీరందడం లేదని, ఉచిత పంటల బీమా నిలిపివేయడంతో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పీపీపీ ప్రాజెక్టుల పేరుతో ప్రైవేటు సంస్థలకు రాయితీలు కల్పిస్తూ ప్రజలపై భారం మోపుతున్నారని, ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణను గట్టిగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.

దిశ చట్టం రద్దు, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన బీసీ నేతలు చింతడ రవి, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించడం వంటి అంశాలను సభలో ప్రస్తావించాలని ఆయన ఆదేశించారు. జూనియర్ డాక్టర్ల సమ్మె, ఉద్యోగులు, మహిళలు, యువతలో ఉన్న అసంతృప్తిని కూడా మండలిలో ఎత్తిచూపాలని, పూర్తి ఆధారాలతో సభకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

- మొదటి పేజి తరువాయి

అధికారులను ఆదేశించారు. ఈ విధానం ద్వారా పారదర్శకతను పెంచడంతో పాటు, నిధుల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పారిశ్రామిక ప్రగతికి ప్రోత్సాహకాలు తప్పనిసరి అని, అయితే వాటిని ఎంతవరకు ఇవ్వగలమనే అంశంపై స్పష్టమైన ప్రణాళిక ఉండాలని సీఎం సూచించారు.బుధవారం (ఆగస్టు 12) నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. ఈ భేటీలో పరిశ్రమలు, ఇంధనం, ఐటీ ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు సంబంధించి మొత్తం 25 ప్రాజెక్టులకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడులు రానుండగా, తద్వారా ప్రత్యక్షంగా 21,627 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.ఇప్పటివరకు జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా మొత్తం 363 ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని, తద్వారా రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.86 లక్షల ఉద్యోగాలు రాష్ట్రానికి రానున్నాయని అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కేవలం సంప్రదాయ పరిశ్రమలే కాకుండా భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ వంటి అధునాతన రంగాలపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుసరించాల్సిన విధానాలపై అధ్యయనం చేయాలని సూచించారు. పారిశ్రామిక ప్రాజెక్టుల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి, వాటిపై కొందరు పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అన్నారు.

ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్లకు కేవలం 3.5 టీఎంసీల నీరు సరిపోతుందని, పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీపైనే విశాఖ పరిశ్రమలకు నీటిని అందిస్తామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని అడ్డుకునేందుకు కొందరు రాజకీయ నిరుద్యోగులు సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కొత్త ప్రాజెక్టులను ఆయా ప్రాంతాల్లో నెలకొల్పేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులు జాతికే గర్వకారణమని, పుట్టపర్తి సమీపంలో డిఫెన్స్, హిందూపురం వద్ద ఏరోస్పేస్ ప్రాజెక్టులు ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. మూలపేట పోర్టు నిర్మాణాన్ని డిసెంబరు నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశించారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు రోడ్, రైల్, పోర్టు కనెక్టివిటీని బలోపేతం చేయాలన్నారు. సెప్టెంబరు నాటికి 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# చంద్రబాబు ఒక విజనరీ లీడర్

- మొదటి పేజి తరువాయి

అని స్పష్టం చేశారు. సాంకేతికత, పాలన, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన చేపట్టిన సంస్కరణలు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నాయని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి, ముఖ్యంగా అమరావతి నిర్మాణానికి, ఐటీ, పారిశ్రామిక రంగాల పురోగతికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దూరదృష్టి కలిగిన నాయకత్వంతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రపతి నుంచి వచ్చిన ఈ ప్రశంసలపై టీడీపీ శ్రేణులు, కూటమి నాయకులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన కుటుంబంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి 'అమరావతి' కాఫీ టేబుల్ బుక్‌ను బహూకరించారు. ఆ పుస్తకంలోని రాజధాని అమరావతి విశేషాలు, ఫొటోలను రాష్ట్రపతి ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టిని కొనియాడుతూ, ఆయన నిజమైన అభివృద్ధికి చిరునామా అని, ఒక విజనరీ లీడర్ అని రాష్ట్రపతి ప్రశంసల వర్షం కురిపించారు. అంతేకాకుండా, ఎంపీ అప్పలనాయుడి నిబద్ధతను రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. పార్లమెంట్ సమావేశాలకు ప్రతిరోజూ సైకిల్‌పై రావడం, 100 శాతం హాజరు నమోదు చేసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సంస్కారం, నిరాడంబరత కలిగిన అప్పలనాయుడిని చూస్తుంటే "నన్ను నేను చూసుకున్నట్లే ఉంది" అని అన్నారు.

# కంపెనీల్లో మహిళా బాస్‌లు చాలా తక్కువ.. పార్లమెంటులో కేంద్రం వెల్లడి

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా సోమవారం లోక్‌సభకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు.ఎంసీఏ21 డేటాబేస్ గణాంకాల ప్రకారం, ఈ 500 కంపెనీల్లో మొత్తంగా 860 మంది మహిళలు బోర్డు సభ్యులుగా, డైరెక్టర్లుగా ఉన్నారు. వీరిలో 738 మంది డైరెక్టర్లు, 67 మంది పూర్తికాల డైరెక్టర్లు, 18 మంది అదనపు డైరెక్టర్లు, 12 మంది నామినీ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. అలాగే, 22 మంది మహిళలు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లుగా (సీఎఫ్ఓ) బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు మంత్రి వివరించారు.

కంపెనీల చట్టం-2013 నిబంధనల ప్రకారం, ప్రతి లిస్టెడ్ కంపెనీ బోర్డులో కనీసం ఒక మహిళా డైరెక్టర్‌ను నియమించడం తప్పనిసరి. ఈ నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత బోర్డు స్థాయిలో మహిళల సంఖ్య పెరిగినప్పటికీ, సీఈవో, ఎండీ వంటి కీలక పదవుల వద్దకు వచ్చేసరికి వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. అయితే, మహిళా డైరెక్టర్లు ఉన్నత నాయకత్వ స్థానాలకు ఎదగడానికి ఎదురవుతున్న అడ్డంకులపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి ప్రత్యేక అధ్యయనం నిర్వహించలేదని, కొత్త విధానాలు లేదా ప్రోత్సాహకాలు ఏవీ ప్రస్తుతం పరిశీలనలో లేవని మల్హోత్రా స్పష్టం చేశారు.మరోవైపు, మహిళా డైరెక్టర్లను నియమించడంలో విఫలమైన కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. 2021-22 నుంచి 2025-26 మధ్య కాలంలో నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలకు సంబంధించి మొత్తం 50 ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఆయా సంస్థలపై రూ. 71.01 లక్షల జరిమానా విధించినట్లు మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం క్రియాశీలకంగా ఉన్న మొత్తం కంపెనీల్లో సుమారు 39 లక్షల మంది డైరెక్టర్లు ఉండగా, వారిలో మహిళల సంఖ్య 11.6 లక్షలుగా ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# భారత్‌లో డిజిటల్ విప్లవం.. డిజిలాకర్‌కు 72 కోట్లు, ఉమంగ్‌కు 11 కోట్ల యూజర్లు!

దేశంలో డిజిటల్ సేవలు విస్తృతంగా ప్రజలకు చేరువవుతున్నాయని, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ ప్లాట్‌ఫామ్‌లైన 'డిజిలాకర్', 'ఉమంగ్' అద్భుతమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. నేడు రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్లలో డిజిలాకర్ వినియోగదారుల సంఖ్య 72.43 కోట్లకు చేరిందని, ఈ ప్లాట్‌ఫామ్‌పై 72.86 కోట్ల డాక్యుమెంట్ యాక్సెస్ లావాదేవీలు జరిగాయని వెల్లడించారు. అదే సమయంలో 'ఉమంగ్' ప్లాట్‌ఫామ్‌లో 11.66 కోట్లకు పైగా యూజర్లు నమోదు కాగా, సుమారు 798 కోట్ల లావాదేవీలు నమోదైనట్లు వివరించారు.ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా, టెక్నాలజీని సామాన్య ప్రజలకు దగ్గర చేసే లక్ష్యంతో 2015 జులైలో 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పౌర కేంద్రీకృత సేవలను సులభంగా అందించేందుకు అనేక చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ఏడాది జులై 31 నాటికి దేశవ్యాప్తంగా ఉమాంగ్ ప్లాట్‌ఫామ్‌పై 2,575 సేవలు (కేంద్రం: 880, రాష్ట్రాలు: 1,695), డిజిలాకర్‌పై 5,437 రకాల డాక్యుమెంట్లు/సేవలు (కేంద్రం: 661, రాష్ట్రాలు: 4,776) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సేవలను అందించేందుకు 'కామన్ సర్వీస్ సెంటర్ల' (సీఎస్‌సీ) నెట్‌వర్క్‌ను ప్రభుత్వం విస్తరించిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. 2026 జూన్ 30 నాటికి గ్రామ పంచాయతీ స్థాయిలో 4,07,122 సీఎస్‌సీలు పనిచేస్తున్నాయని, వీటిలో 70,069 కేంద్రాలను మహిళా పారిశ్రామికవేత్తలు (విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్స్) నిర్వహిస్తుండటం విశేషమని అన్నారు. ప్రభుత్వ, బ్యాంకింగ్, ఆర్థిక, బీమా, పింఛను వంటి అనేక సేవలను ఈ కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు.

ఉమంగ్, డిజిలాకర్ ప్లాట్‌ఫామ్‌లు మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్స్ ద్వారా అందుబాటులో ఉన్నాయని, దీనివల్ల పౌరులు ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా ప్రభుత్వ సేవలను పొందవచ్చని మంత్రి వివరించారు. ఆధార్, ఈ-సైన్, ఏపీఐ సేతు వంటి కీలకమైన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో ఈ ప్లాట్‌ఫామ్‌లను అనుసంధానించామని, తద్వారా సురక్షితమైన, కాగితరహిత సేవలు అందించడం సాధ్యమవుతోందని తెలిపారు. ఈ విధానం వల్ల భౌతికంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అవసరం తగ్గి, పౌరులకు సమర్థవంతమైన సేవలు అందుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

# జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన

- మొదటి పేజి తరువాయి

తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు.యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు" అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.

# జగన్‌కు ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి.. ఆధారాలతో చర్చకు మేం సిద్ధం

- మొదటి పేజి తరువాయి

ఆమె మీడియాతో మాట్లాడుతూ జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు."ఎమ్మెల్యేగా గెలిచిన వారికి తమ నియోజకవర్గ సమస్యలను శాసనసభలో ప్రస్తావించడం ప్రాథమిక బాధ్యత. కానీ జగన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరుకాకపోవడం విచారకరం. గతంలో శాసనమండలిని రద్దు చేయాలని తీర్మానం చేసిన జగన్, ఇప్పుడు అదే మండలికి తమ ప్రతినిధులను పంపుతున్నారు. కానీ ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలను మాత్రం అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారు" అని అనిత ఆరోపించారు. ప్రభుత్వంపై చేసే ఆరోపణలకు అసెంబ్లీ కంటే మెరుగైన వేదిక మరొకటి లేదని, తాము ప్రతి అంశంపై చర్చించి సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

**ఐదేళ్లలో చేయలేని వారు ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారు**

మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను హోంమంత్రి తీవ్రంగా ఖండించారు. "ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీని కూడా పూర్తి చేయలేని వైసీపీ నేతలు, ఇప్పుడు మేము పారదర్శకంగా నిర్వహిస్తుంటే నిరాధార ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉంది. డీఎస్సీపై ఆధారాలుంటే అసెంబ్లీకి వచ్చి చూపించండి. మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలని, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేయడం కేవలం రాజకీయ లబ్ధి కోసమే" అని అన్నారు.

కష్టపడి చదివి, కుటుంబాలకు దూరంగా ఉండి, కోచింగ్‌లకు వేల రూపాయలు ఖర్చు చేసి ఉద్యోగాలు సాధించిన యువత ప్రతిభను, వారి కుటుంబాల ఆనందాన్ని అవమానించేలా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని అనిత ఆవేదన వ్యక్తం చేశారు. "మొత్తం డీఎస్సీ నియామకాలే అక్రమమని మాట్లాడితే, ఉద్యోగం సాధించిన వారి కష్టాన్ని, ప్రతిభను కించపరిచినట్లే. రాజకీయాల కోసం యువత భవిష్యత్తుతో, వారి మనోభావాలతో ఆడుకోవద్దు" అని హితవు పలికారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం**

అంతకుముందు, హోంమంత్రి అనిత పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి సమస్యలను ఓపికగా విని, మొత్తం 65 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని హామీ ఇచ్చారు. 'మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్' బాధితులు తమ గోడును వెళ్లబోసుకోగా, ప్రభుత్వం ఇప్పటికే డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసిందని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని, ఆర్థిక మోసాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.అలాగే, నాయుడుపేట నుంచి వచ్చిన ఓ తండ్రి తన కుమార్తె చదువు, తన ఉపాధి గురించి మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆమె వెంటనే స్పందించారు. చిన్నారిని హాస్టల్‌లో చేర్పించి చదువు కొనసాగించేలా చూడాలని, తండ్రికి ఉపాధి కల్పించే అంశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించడమే తమ ప్రభుత్వ బాధ్యత అని అనిత పేర్కొన్నారు.

# రాజ్యసభను కుదిపేసిన "లుంగీవాలా" వివాదం

- మొదటి పేజి తరువాయి

దక్షిణాది వాడినని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలపై సుస్మితా దేవ్‌పై హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు.ఈ ఆరోపణలను సుస్మితా దేవ్ తీవ్రంగా ఖండించారు. తాను అసోంకు చెందిన బెంగాలీనని, వివిధ రాష్ట్రాల వస్త్రధారణ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అసత్యాలు చెబుతున్నారని, ఏ విచారణలోనైనా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, మతపరమైన గుర్తింపులపై బ్రిట్టాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై ఆమె కూడా ప్రివిలేజ్ నోటీసు దాఖలు చేశారు.ఈ వివాదంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కొందరు ఎంపీలు పార్లమెంట్ వెలుపల పంచెకట్టుతో నిరసన తెలిపారు. సభా నాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడాలని సభ్యులను కోరారు. సభ్యులు ఒకరి సాంస్కృతిక సంప్రదాయాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని సూచించిన చైర్మన్, ఇరుపక్షాలను తన ఛాంబర్‌కు పిలిచి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఇరుపక్షాలు అందజేసిన హక్కుల ఉల్లంఘన నోటీసులు చైర్మన్ పరిశీలనలో ఉన్నాయి.

# శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- మొదటి పేజి తరువాయి

స్పోర్ట్స్ కోటాలో మెరిట్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఆధారాలున్నా ప్రభుత్వం స్పందించడం లేదని బొత్స ఆరోపించారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని, ఈ అంశంపై శాసనమండలిలో పోరాడతామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో అభివృద్ధి అంతా సీఎం చంద్రబాబు కుటుంబానికి, టీడీపీ నేతలకే పరిమితమైందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు, ప్రజా సమస్యలన్నింటినీ అసెంబ్లీ వేదికగా లేవనెత్తుతామన్నారు. 40 శాతం ఓటు షేర్ సాధించిన వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడం ప్రజా తీర్పును అవమానించడమేనని మండిపడ్డారు. చట్టసభల్లో నిబంధనల ప్రకారమే నడుచుకుంటామని, ప్రభుత్వాన్ని ప్రతి అంశంలో ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు.

## లబడపుట్టు నుంచి మొక్కపుట్టు గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలి

**సుమారు రెండు కిలో మీటర్లు సరైన రహదారి లేదా ప్రజల ఇక్కట్లు.**

**టిడిపి నాయకులు చెండా బాపూజీ.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 12.** మండలంలో గల మాకవరం పంచాయతీ లబడపుట్టు నుంచి మొక్కపుట్టు గ్రామానికి సుమారు రెండు కిలో మీటర్లు బీటీ రోడ్డు నిర్మించాలని టీడీపీ నాయకుడు చెండా బాపూజీ ప్రభుత్వాని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. లబడపుట్టు నుంచి మొక్కపుట్టు గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్లు సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు వర్షాకాలంలో ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో మట్టి రోడ్డు బురదమయంగా మారడంతో ప్రజలు రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మొక్కపుట్టు గ్రామ ప్రజలు అనారోగ్యం బారిన పడితే 108 వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఏళ్ల తరబడిగా మట్టి రోడ్డుతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు స్పందించి రెండు మీటర్లు తారు రోడ్డు నిర్మించాలని గ్రామస్తులతో కలిసి ప్రభుత్వాన్ని వేడుకున్నారు.



పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# రేషన్ పంపిణీలో లోపాలకు తావులేకుండా చర్యలు

- పీడీఎస్ సేవల్లో పారదర్శకత, నాణ్యతకు పెద్దపీట
- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 12 :** ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదా రుడికి నాణ్యమైన రేషన్ సరుకులు సకాలంలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ఆమె సమీక్షించా రు.జిల్లాలో 642 ఫెయిర్ ప్రైస్ దుకాణాల ద్వారా 5,28,863 రేషన్ కార్డులకు చెందిన సుమారు 16 లక్షల మంది లబ్ధిదా రులకు సేవలు అందుతున్నాయని అధికారులు వివరించారు. రేషన్ సరుకుల నాణ్యత, సరఫరా, పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని జేసీ సూచించారు. ఈ-పాస్ విధానం సమర్థ వంతంగా అమలు చేయడంతో పాటు వృద్ధులు, దివ్యాంగు లకు ఇంటి వద్దకే రేషన్ అందించే డోర్ డెలివరీ సేవలను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు.

ఐసీడీఎస్, ప్రధానమంత్రి పోషణ శక్తి నిర్మాణ్ పథకాల కింద పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహార సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, సంక్షేమ హాస్టళ్లకు కేటాయించే బియ్యం పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దీపం-2 పథకంలో అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీ ప్రయోజనాలు



సకాలంలో అందేలా చూడాలని విద్యాధరి పేర్కొన్నారు. ఎల్పీజీ కనెక్షన్లకు సంబంధించిన సేవలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా రైతు బజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాల పనితీరును కూడా ఆమె సమీక్షించారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు నాణ్యమైన బియ్యం అందిస్తూ బహిరంగ మార్కెట్‌లో ధరల నియంత్రణకు ఈ కేంద్రాలు దోహదపడేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలో 75 ఫెయిర్ ప్రైస్ దుకాణాల్లో అమలు చేస్తున్న 'మీ మార్ట్' కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని జేసీ సూచించారు. రేషన్ కార్డుదారులకు అవసరమైన నిత్యావసర వస్తువులు ఒకేచోట అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న ఫెయిర్ ప్రైస్ దుకాణాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో డీఎస్వో భాస్కరరావు, ఏఎస్వో కళ్యాణి, సివిల్ సప్లైస్ డీఎం సృజన, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె. రామారావు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేశ్, లీగల్ మెట్రాలజీ ఏసీ రాధాకృష్ణ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు, డీలర్లు, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దేశభక్తిని చాటి చెప్పేలా ఘనంగా సైకిల్ ర్యాలీ.

### మన్యం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి




**పార్వతీపురం,ఆగస్టు 12 పెన్ పవర్.**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు,150వ వందేమాతరం జాతీయ గీతం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీ దేశభక్తి,జాతీయ ఐక్యతను చాటి చెప్పేలా 250 అడుగుల జాతీయ జెండాతో పాత బస్ స్టాండ్ నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని బుధవారం ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. సైకిల్ ర్యాలీ సందర్భంగా జాతీయ జెండాలు చేతబూని,దేశభక్తి నినాదాలతో పాల్గొన్న అధికారులు,విద్యార్థులు, ఉద్యోగులు,యువత ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్ వైశాలి,డిఆర్ఓ కే హేమలత,ఆర్డీఓ మాధురి,వివిధ శాఖల అధికారులు,పలు కళాశాల విద్యార్థి,విద్యార్థులు, దేశభక్తులు పాల్గొన్నారు.



వివరాలు 4లో..




## ఇంటింటికి ప్రభుత్వ అభివృద్ధి పథకాల కరపత్రాలు పంపిణీ



- మండలం టీడీపీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ.
- మాకవరం పంచాయతీ అధ్యక్షుడు కొచ్చో కామరాజు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 12.** మండలంలోని మాకవరం, జోలపుట్టు పంచాయతీల పలు గ్రామాలలో ఇంటింటికి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేసినట్లు టిడిపి మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ అన్నారు. టిడిపి సీనియర్ నాయకుడు వంతాల రామస్వామి ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించమన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఇంటింటికి ప్రజలతో మమేకమవుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకొని రెండేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమలపై కరపత్రాలు ప్రతీ కుటుంబానికి అందించి వివరించామన్నారు.

అదేవిధంగా మాకవరం పంచాయతీ మేభ గ్రామంలో మాకవరం టిడిపి అధ్యక్షుడు కొచ్చో కామరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మంచి జరుగుతుందని, రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కామరాజు తెలిపారు. ఈ కార్యక్రమలలో టీడీపీ నాయకులు కిరసాని లైకోన్, గణేష్, మఠం రఘుపతి పడాల్, చెట్టి నవీన్ కుమార్, సింహాచలం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు 4లో..

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు.. బాలికలకు డీఎస్పీ హితబోధ

* బాలికలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్,ఆగస్టు12:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గూడెం కొత్తవీధి మండలం దేరల గ్రామంలోని ఏపీఆర్‌డబ్ల్యు బాలికల జూనియర్ కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చింతపల్లి డీఎస్పీ తిరుమలరావు, జీకే వీధి సీఐ సుధాకర్, ఎస్సై సురేష్ కళాశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎస్పీ తిరుమలరావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. విద్య ద్వారా ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగవచ్చని వివరించారు. అలాగే ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ మోసాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింక్‌లకు స్పందించరాదని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని అవగాహన కల్పించారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థినులు పూర్తిగా దూరంగా ఉండాలని, వాటి వల్ల భవిష్యత్తు నాశనమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థినులకు ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా పోలీసులను లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు అమర్ పతాక ఆవిష్కరణ




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,ఆగష్టు 12:** పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకుడు అమర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ.. 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని బెనారస్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఏఐఎస్ఎఫ్‌ను స్థాపించారని తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషించిందన్నారు. అనేక మంది విద్యార్థులు ఉద్యమంలో పాల్గొని జైలు శిక్షలు అనుభవించడంతో పాటు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఘనమైన చరిత్ర ఏఐఎస్ఎఫ్‌కు ఉందన్నారు. శాంతి, అభ్యుదయం, శాస్త్రీయ సోషలిజం కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. విద్య అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో స్వాతంత్ర్యం అనంతరం కూడా అనేక ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యను సామాన్యులకు దూరం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోందని విమర్శించారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, నాణ్యమైన బోధనా సిబ్బంది లేకపోయినా భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వాలు దీనిపై తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో కూడా మౌలిక వసతులు, పౌష్టికాహారం కొరవడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం ప్రతి సామాన్యుడికీ సమానంగా అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'చదువుతూ పోరాడు.. చదువుకై పోరాడు' అనే నినాదంతో ఏఐఎస్ఎఫ్ దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వంతల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల హక్కులు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం జిల్లాలో మరింత బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సీదారి జగదీష్, జిల్లా సమితి సభ్యుడు గెమ్మెలి మోహన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### డిగ్రీ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల గడువు ఈ నెల 18 వరకు పొడిగింపు

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,ఆగష్టు 12:** ఆంధ్రప్రదేశ్‌లో డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల గడువును ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించినట్లు ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి ఆగస్టు 11తో ముగియాల్సిన రిజిస్ట్రేషన్ గడువును ప్రభుత్వం పొడిగించినట్లు పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన తాజా షెడ్యూల్‌ను త్వరలో కామన్ అడ్మిషన్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సవరణలు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుల్లో సవరణల కోసం విద్యార్థులు పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. జానకిరావు సూచించారు. ప్రత్యేక కేటగిరీకి చెందిన విద్యార్థులకు సంబంధిత హెల్ప్‌లైన్ కేంద్రాల్లో భౌతిక ధ్రువీకరణ ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు.

# ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు కీలక ముందడుగు



Notification No.401-SEC-F1-2026-1 PDF

**A.P. STATE ELECTION COMMISSION**
1st Floor, New HODs Building, M.G. Road, Vijayawada – 520010.

**NOTIFICATION**

**No. 401/SEC-F1/2026-1** **Dt: 12.08.2026**

In exercise of the powers conferred under Article 243ZA of the Constitution of India, Sections 9, 10 and 12 of the Municipal Corporations Act, 1955, Section 11 and 14 of A.P. Municipal Corporations Act, 1994, Section 7 of Vijayawada Municipal Corporation Act, 1981, Section 7 of Visakhapatnam Municipal Corporation Act, 1979 and A.P. Municipal Corporations (Preparation and Publication of Electoral Rolls) Rules, 2001, the State Election Commission, hereby, notifies **03.09.2026** as the date for publication of Ward-wise Photo Electoral Rolls of all Municipal Corporations in the State for the purpose of conduct of elections by the State Election Commission and also to facilitate the Government to finalize reservation of offices of Mayors and seats of Ward Members in respect of all Municipal Corporations taking the State as a unit. The Ward-wise Photo Electoral Rolls shall be published along with Notice in Form-I prescribed under the said Rules.

Under Rules 3 and 5 of the said rules, the State Election Commissioner, hereby, authorizes the Commissioners of all the Municipal Corporations in the State and the Zonal Commissioner concerned in respect of Greater Visakhapatnam Municipal Corporation (GVMC)for preparation and publication of the Ward-wise Photo Electoral Rolls of their respective Municipal Corporation and respective Zone in respect of GVMC with reference to 01.01.2026 as the qualifying date duly adopting the latest Assembly Electoral Rolls published and updated from time to time with reference to the said qualifying date so far as they relate to the areas forming part of the Corporations concerned and Zones in respect of GVMC.

The Commission will issue Procedural Instructions on Preparation and Publication of Ward-wise Photo Electoral Rolls of Municipal Corporations.

**SD/- ANIL CHANDRA PUNETHA**
**STATE ELECTION COMMISSIONER**

To
1. All the Commissioners of Municipal Corporations.
2. All the Zonal Commissioners of the Greater Visakhapatnam Municipal Corporation through the Commissioner, GVMC.
3. All the Collectors & District Election Authorities in the State.

Copy to:
1. The Election Authority & Commissioner and Director of Municipal Administration, A.P.
2. The Principal Secretary, MA & UD Department, AP Secretariat, Velagapudi.

// Attested //
Joint Director
12/08/2026
ASO



**పొలిటికల్ బ్యూరో పెన్ పవర్ అమరావతి/ విశాఖపట్నం ఆగస్టు 12:** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియకు కీలకమైన ముందడుగు పడింది. రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాల ప్రచురణకు నోటిఫికేషన్ జారీ చేసింది.

రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 3, 2026న రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాలను ప్రచురించనున్నారు.

**జనవరి 1 అర్హత తేదీగా**

వార్డుల వారీ ఓటర్ల జాబితాల తయారీకి 2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా పరిగణించనున్నారు. ఈ తేదీని ఆధారంగా తీసుకుని, అప్పటికి ప్రచురించబడిన తాజా శాసనసభ ఓటర్ల జాబితాలను పరిశీలించి మున్సిపల్ వార్డుల పరిధిలోని ఓటర్ల వివరాలను సిద్ధం చేయనున్నారు.

**మేయర్, వార్డు సభ్యుల స్థానాల రిజర్వేషన్లకు ఉపయోగం**

వార్డుల వారీగా రూపొందించే ఫొటో ఓటర్ల జాబితాలు కేవలం ఎన్నికల నిర్వహణకే కాకుండా మేయర్ పదవి, వార్డు సభ్యుల స్థానాల రిజర్వేషన్లను ఖరారు చేయడానికి కూడా ప్రభుత్వానికి ఉపయోగపడనున్నాయి.

ప్రతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏ వార్డులో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, ఆయా వార్డుల పరిధిలోని ఓటర్ల వివరాలు ఏమిటన్నది ఈ జాబితాల ద్వారా స్పష్టమవుతుంది. ఎన్నికల నిర్వహణలో ఇది అత్యంత కీలకమైన అంశంగా ఉంటుంది.

**మున్సిపల్ కమిషనర్లకు బాధ్యత**

ఆయా మున్సిపల్ కార్పొరేషన్ల వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి ప్రచురించే బాధ్యతను సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు అప్పగించారు.

**జీవీఎంసీకి ప్రత్యేక బాధ్యతలు**

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాత్రం ఆయా ప్రాంతాలకు సంబంధించిన జాబితాల తయారీ, ప్రచురణ బాధ్యతలను సంబంధిత ప్రాంతీయ కమిషనర్లకు అప్పగించారు.

జీవీఎంసీ పరిధిలోని ప్రతి ప్రాంతానికి చెందిన వార్డులను పరిగణనలోకి తీసుకుని, ఆయా ప్రాంతాల అసెంబ్లీ ఓటర్ల జాబితాలను ఆధారంగా చేసుకుని వార్డు వారీ ఓటర్ల జాబితాలను రూపొందించనున్నారు.

**ఎన్నికల ప్రక్రియలో తదుపరి దశలకు మార్గం**

మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడానికి ముందుగా వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం కావడం తప్పనిసరి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 3న ఓటర్ల జాబితాల ప్రచురణకు నిర్ణయం తీసుకోవడం ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమైన దశగా భావిస్తున్నారు.

అయితే ఈ నోటిఫికేషన్‌లో ఎన్నికల తేదీని ప్రకటించలేదు. ప్రస్తుతం వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణకు సంబంధించిన ప్రక్రియను మాత్రమే రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రారంభించింది.

ఓటర్ల జాబితాల ప్రచురణ అనంతరం చేపట్టాల్సిన తదుపరి చర్యలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలు, రిజర్వేషన్లు, ఎన్నికల తేదీలపై రాష్ట్ర ఎన్నికల సంఘం తదుపరి ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది.

మొత్తంగా చూస్తే, వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాల ప్రక్రియ ప్రారంభం కావడం ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల దిశగా కీలకమైన ముందడుగుగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# జీవీఎంసీ టికెట్‌కు కోటి?

**బేరసారాలపై ఆరోపణలు!**

**జీవీఎంసీ ఎన్నికల వేడి**

**టికెట్ల కోసం పోటీదారుల పరుగులు!**

**విశాఖ, పెన్ పవర్, ఆగస్టు 12 :** 2021 లో జరిగిన గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల తర్వాత మరోసారి కార్పొరేట్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియక ప్రజలు, రాజకీయ నాయకులు సందిగ్ధంలో ఉన్నారు. అయితే మరో రెండు, మూడు నెలల్లో జీవీఎంసీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న ప్రచారంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో టికెట్ల కోసం అప్పుడే హడావుడి మొదలైనట్లు తెలుస్తోంది. పార్టీల తరపున పోటీ చేయాలను కుంటున్న ఆశావహులు తమకు టికెట్ కేటాయించాలంటూ పార్టీ పెద్దలను కలుస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో కొన్ని పార్టీల్లో అభ్యర్థుల నుంచి పార్టీ ఫండ్ పేరుతో భారీ మొత్తాలపై బేరసారాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభ్యర్థుల సామర్థ్యం, వార్డులో ఉన్న ప్రజా సమస్యలపై అవగాహన, ప్రజలతో ఉన్న సంబంధాలు, పార్టీ కోసం చేసిన సేవలను పరిగణనలోకి తీసుకోకుండా.. "ఏ వార్డులో పోటీ చేస్తారు? పార్టీకి ఎంత ఫండ్ ఇవ్వగలరు?" అనే అంశాలపైనే ప్రధానంగా చర్చ జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

విశాఖలోని కొన్ని వార్డుల్లో ఇప్పటికే ఆశావహులు సమావేశా లు నిర్వహించి తమకు టికెట్ ఇవ్వాలని పార్టీ పెద్దలను కోరినట్లు విశ్వసనీయ సమాచారం. కొందరు పోటీదారులు భారీ మొత్తంలో పార్టీ ఫండ్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల్లో అసం తృప్తి వ్యక్తమవుతోంది. కుటుంబాలను, వ్యక్తిగత ప్రయోజనా లను పక్కనపెట్టి పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలకు కట్టుబడి పనిచేసిన కార్యకర్తలకు కాకుండా ఆర్థిక సామర్థ్యమే టికెట్‌కు ప్రాతిపదికగా మారితే తమ పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తు న్నారు.

కార్పొరేట్ టికెట్ల కేటాయింపులో డబ్బు కన్నా ప్రజల్లో ఉన్న ఆదరణ, పార్టీ పట్ల నిబద్ధత, వార్డుపై అవగాహన, ప్రజా సమ స్యల పరిష్కారానికి ఉన్న చిత్తశుద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కార్యకర్తలు, ప్రజలు కోరుతున్నారు. జీవీఎంసీ ఎన్నికలపై స్పష్టత రాకముందే టికెట్ల కోసం జరుగుతున్న ఈ అంతర్గత రాజకీయాలు విశాఖ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## 87వ వార్డు లో నూతనంగా వేసిన బోర్ లు ప్రారంభోత్సవం

**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు 12** మహా విశాఖ నగర పాలక సంస్థ 87వ వార్డు పరిధిలో నూతనంగా వేసిన రెండు బోర్లను ప్రారంభించారు . కార్యక్రమానికి ముఖ్య అతిధి గా మాజీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం పాల్గొన్నారు. వడ్లపూడి ,శెట్టిబలిజ వీధి , కళింగ వీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన బోరులను వేయడం జరిగిందని. రాష్ట్ర అధ్యక్షుడు , నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు నియోజకవర్గం అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని,87 వార్డు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు విజయరామరాజు, ద్రోణాద్రి అప్పలనాయుడు, గండిమాన కనకరాజు, కడుపుట్ల శ్రీను, బొడ్డ సన్యాసి, దుర్గపు



రాజేంద్రప్రసాద్, ఆదినారాయణ, జాన్ రమేష్, శ్రీరామ్ మూర్తి, దాలయ్య, వెంకటరావు, బొడ్డా సన్యాసి,మురలి వాటర్ లైన్ డిపార్ట్మెంట్ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



**58వ వార్డులో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ప్రచారం**

**ములగాడ, పెన్ పవర్,ఆగష్టు 12 :** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్స వాన్ని పురస్కరించుకుని ప్రధానమం త్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్ర మాన్ని విశాఖ పశ్చిమ నియోజకవర్గం లో ఘనంగా నిర్వహించారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు గణబాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలోని 58వ వార్డు రాజకమలదేవి కాలనీ, ఉప్పర కాలనీ లలో 'హర్ ఘర్ తిరంగా' ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు స్వయంగా స్థానిక నివాసా లు, వ్యాపార సముదాయాలకు జాతీ య జెండాలను కట్టించారు. ప్రతి ఒక్క రూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజలు పెద్ద సం ఖ్యలో పాల్గొని జాతీయ స్ఫూర్తిని చా టాలని కోరారు.

## దొడ్డికొండలో రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కల తొలగింపు




**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 12:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీ పరిధిలోని దొడ్డికొండ-2 గ్రామంలో స్వచ్ఛ పథకం కార్యక్రమంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. జేసీబీ సహాయంతో రహదారి వెంబడి పేరుకుపోయిన వ్యర్థాలు, ముళ్లపొదలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి ఆర్. లక్ష్మి పర్యవేక్షించారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడటంతో పాటు రహదారులపై ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసా కార్యదర్శి మాదిరి చంటిబాబు, వెటర్నరీ అసిస్టెంట్ సత్యనారాయణ, క్లాప్ మిత్రాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధితులకు సిఎం ఆర్ ఎఫ్ అందజేత




**గాజకూర్మన్నపాలెం :పెన్ పవర్ ,ఆగస్టు 12** జీవీఎంసీ 85వార్డు చట్టివానిపాలెం గ్రామం లో మొల్లి సురేష్ ,మొల్లి హారిక దంపతుల కుమార్తె మొల్లి బాల చంద్రిక 3 నెలల పాప గుండె సంబంధిత వ్యాదితో బాధపడుతున్న చట్టివానిపాలెం గ్రామ నాయకులు వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర దృష్టికి తీసుకెళ్లారు . టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు ,గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు కి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి బాలచంద్రిక గుండె ఇబ్బందితో బాధపడుతున్న విషయాన్ని శాసనసభ్యుడు వివరించడంతో స్పందించిన ముఖ్యమంత్రి బాలచంద్రకి 249257 రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎల్ వో సి ను హాస్పిటల్ వారి పేరున మంజూరు చేశారు . ఎల్ఓసి పత్రాన్ని వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర , ప్రధాన కార్యదర్శి విందుల రాజు, వారి కుటుంబానికి అందజేశారు . ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర మాట్లాడుతూ , సంక్షేమం అభివృద్ధితోపాటు, కష్టంలో ఉన్న ఎంతోమందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కూటమి ప్రభుత్వం సహాయం చేయడం జరుగుతుందని, ప్రజలు ఈ యొక్క ప్రభుత్వానికి ఎప్పుడూ అండగా ఉంటే మరిన్ని ప్రజలకు సేవలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు మొల్లి కోటి ,చట్టివానిపాలెం గ్రామ పెద్దలు వెంకట అప్పారావు , బూత్ ఇన్చార్జ్ కురందాసు దుర్గారావు ,పల్లదేముడు ,చట్టి రాము, కురందాసు గోవిందు పాల్గొన్నారు .

# ఘనంగాకాంగ్రెస్ పార్టీ నాయకుడు అప్పారావు 12 వ వర్ధంతి...!

### వేడుకల్లో వితంతు మహిళలకు చీరలు పంపిణీ...!

**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 12:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గీయ జలుమూరి అప్పారావు 12 వ వర్ధంతి వేడుకలు బుధవారం సింగవరం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బడుగు రమేష్ బాబు, యూ. చిడిపాలెం పి హెచ్ సి వైద్యాధికారి హేమంత్ స్థానిక సి హెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, దట్టెం మురళీకృష్ణ ల ఆధ్వర్యంలో పలువురు వితంతు మహిళలకు వారి చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ముప్పై ఏబై ఏళ్ల పాటు ఈ ప్రాంతానికి అప్పారావు చేసిన సేవలు చిరస్మరణమైనవని పలువురు నాయకులు కొనియాడారు. ఈకార్యక్రమంలో జలుమూరి నాగేశ్వరావు, గణబాబు, వేంకటగిరి, గోవింద్, ఆనంద్, వెంకటేశ్, విజయ్, ఆదిత్య గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.





## అంగన్వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణ...!



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 12:** కొయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలకు "జ్ఞాన జ్యోతి " కార్యక్రమం 6 రోజుల శిక్షణలో భాగంగా రెండవ రోజు సి ఎ హెచ్ పాఠశాల లో ఐసీడీఎస్ ప్రాజెక్టు సిడిపిఓ దేవమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ దేవమని మాట్లాడుతూ...అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు అన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలకు పిల్లల అభివృద్ధి, పోషకాహారం, ఆరోగ్యం, ప్రీ-స్కూల్ విద్య , బాలల సంరక్షణ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

శిక్షణలో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అంగన్వాడీ సేవలను మరింత మెరుగుపరచడం, లబ్ధిదారులకు నాణ్యమైన సేవలు అందించడం వంటి అంశాలపై కూడా శిక్షణ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో యం ఇ ఓ సింహాచలం , సిహెచ్ స్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు , డి ఆర్ పి లు సురేష్ , భరత్ ,సూపర్వైజర్లు రామలక్ష్మి , విజయలక్ష్మి, సత్యవతి, కనక మహాలక్ష్మి, బాలమణి, బిపిసి సోమశేఖర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. జ్ఞాన జ్యోతి శిక్షణ ద్వారా అంగన్వాడీ కార్యకర్తల్లో నూతన జ్ఞానం, నైపుణ్యాలు పెంపొందించి, కేంద్రాల సేవలను మరింత నాణ్యంగా అందించేందుకు దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి వాసుపల్లి అండ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 12 :**వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త దొడ్డి పైడి రాజు కుటుంబా నికి మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అండగా నిలిచారు. పైడి రాజు గుండెపోటుతో అకాల మృతి చెందిన విషయం తెలుసుకున్న వాసుపల్లి గణేష్ కుమార్ 34వ వార్డులోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడం తీరని లోటని వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. పైడి రాజు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

ప్రజలకు సేవ చేయడం తన పూర్వజన్మ సుకృతంగా భావి స్తానని, మానవసేవే మాధవసేవ అనే మదర్ థెరిసా ఆశయా లు తనకు ఎంతో ఇష్టమని వాసుపల్లి తెలిపారు. తాను అధి కారంలో ఉన్నా లేకపోయినా దక్షిణ నియోజకవర్గ ప్రజలకు, తన వెంట నడిచే పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తోట పద్మావతి, స్టేట్ జాయింట్ సెక్రటరీ లింగం శ్రీను, స్టేట్ బీసీ సెల్ సెక్రటరీ లండ రమణ, జిల్లా స్టూడెంట్ వైస్ ప్రెసిడెంట్ గరికిన వెంకటేష్, వార్డు మహిళా అధ్యక్షురాలు సీహెచ్. జ్యోతి, వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు అంబటి అప్పలరాజు, 43వ బూత్ అధ్యక్షురాలు కారి దానియమ్మ, వార్డు క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు పోటీలా అప్పారావు, వార్డు మైనారిటీ అధ్యక్షురాలు షేక్ ఆశ, జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు, జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ చోడిపిల్లి శివ, చేపల రాజు, 34వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని మండలాలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలి

- దూరభారాల సాకుతో గిరిజన ప్రాంతాలను విస్మరించొద్దు
- చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- భారత్ ఆదివాసి సమైక్య అధ్యక్షుడు గడుతూరి రామగోపాల్



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్ ఆగస్టు 12:** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అన్ని మండలాలకు సమాన ప్రాధాన్యత కల్పించి, గిరిజన రైతులకు ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ ప్రోత్సాహకాలు, శిక్షణ కార్యక్రమాలు సమానంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని భారత్ ఆదివాసి సమైక్య అధ్యక్షుడు, అభ్యుదయ రైతు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మాజీ జిల్లా కార్యదర్శి గడుతూరి రామగోపాల్ డిమాండ్ చేశారు. జిల్లాలో వ్యవసాయ, వాణిజ్య పంటల సాగులో ఎంతో ప్రాధాన్యత కలిగిన చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాలకు తగిన స్థాయిలో ప్రాధాన్యత లభించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీడీఏ ప్రధాన కార్యాలయానికి దూరంగా ఉన్న ప్రాంతాలనే కారణంగా చూపకుండా, మారుమూల గిరిజన ప్రాంతాల రైతుల సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించాలని కోరారు. వ్యవసాయం, ఉద్యానవన రంగాలకు సంబంధించిన సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, రాయితీ పథకాల అమలు, వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ వంటి కార్యక్రమాలు అన్ని మండలాల్లో సమానంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పాడేరు, అరకు ప్రాంతాలకే పరిమితం కాకుండా చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాల్లోనూ తరచుగా కార్యక్రమాలు నిర్వహించి రైతులకు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రాంతాల్లోని గిరిజన రైతులు కాఫీ, మిరియాలు, పసుపు తదితర వాణిజ్య పంటల సాగులో అనుభవం, నైపుణ్యం కలిగి ఉన్నారని తెలిపారు. అయితే స్పైసెస్ బోర్డు, ఉద్యానవన శాఖల నుంచి అవసరమైన సాంకేతిక సహకారం, శిక్షణ, మార్కెటింగ్ సౌకర్యాలు, రాయితీలు, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన మరింత విస్తృతంగా అందాల్సి ఉందన్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా మారుమూల మండలాలకు క్షేత్రస్థాయిలో వెళ్లి రైతుల సమస్యలను తెలుసుకోవాలని రామగోపాల్ కోరారు. చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాలను అభివృద్ధి, వ్యవసాయ ప్రోత్సాహక కార్యక్రమాల్లో వెనుకబడిన ప్రాంతాలుగా చూడకుండా, వాటి భౌగోళిక పరిస్థితులు, గిరిజన రైతుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఇకపై జిల్లా అధికారులు, ఐటీడీఏ, ఉద్యానవన శాఖ, స్పైసెస్ బోర్డు అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలోని ప్రతి మండలానికీ సమాన అవకాశాలు, సమాన ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి, చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాల రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## చిన్నారులకు విద్యతోపాటు నాణ్యమైన పోషకాహారం అందించాలి.



**కురుపాం ఆగస్టు 12 పెన్ పవర్.** అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మరింత నాణ్యమైన ప్రాథమిక విద్య,పోషణ,ఆరోగ్యం,రక్షణ సేవలు అందించేందుకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి కార్యక్రమం ఆరు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం కురుపపాంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా కొనసాగుతుంది. ఈ మేరకు సిడిపిఓ విజయ్ దుర్గ మాట్లాడుతూ,ఈ శిక్షణలో చిన్నారుల సమగ్ర అభివృద్ధి,ఆటల ద్వారా అభ్యాసం,బోధనా సామగ్రి వినియోగం,పాఠశాల సంసిద్ధత,ఆరోగ్యం-పోషణ,బాలల రక్షణ అవగాహన కల్పిస్తూ తదితర అంశాలపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ అందిస్తున్నారు. అంగన్వాడీ కార్యకర్తలు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టి చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సూపర్వైజర్ వై రామ లక్ష్మి,ఉపాధ్యాయులు బి బాబురావు,సిహెచ్ ముకుంద రావు,జి సందీప్,శిక్షణా సిబ్బంది,మరియు మండల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి




### సర్వే శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వివిఎస్ఎన్ కుమార్

**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 12:** భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, ప్రజలకు రెవెన్యూ సేవలను పారదర్శకంగా, సకాలంలో అందించాలని సర్వే శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వీఎస్ఎన్.కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సర్వే, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 1,400 గ్రామాల్లో మూడు విడతలుగా రీ సర్వే చేపట్టేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. తొలి విడతలో 493 గ్రామాల్లో సర్వే ప్రారంభించగా, రెండో విడతలో 454, మూడో విడతలో 450 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు వివరించారు. తొలి విడతలోని 493 గ్రామాలకు గాను ఇప్పటివరకు 96 గ్రామాల్లో 24,640 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయిందన్నారు. ప్రజల నుంచి అందే దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పీజీఆర్ఎస్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సకాలంలో రెవెన్యూ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రికార్డుల భద్రతలో డిజిటలైజేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 11 మండలాల పరిధిలోని సర్వేయర్లు, రీ సర్వే డీటీలు, రెవెన్యూ సిబ్బందికి వివిధ అంశాలపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ సేవలకు సంబంధించిన సాంకేతిక అంశాలు, నూతన విధానాలు, ప్రభుత్వ మార్గదర్శకాలను అధికారులకు వివరించారు. ప్రజల సమస్యలను సానుకూలంగా స్వీకరించి త్వరితగతిన పరిష్కార మార్గం చూపాలని సూచించారు. ఈ సమావేశంలో డీడీ హరికృష్ణ, జిల్లా సర్వే అధికారి ఈశ్వర దొర, డీఐఓఎస్ జి.వెంకటరావు, సిల్వర్ లైన్ టెక్నో సొల్యూషన్స్ ప్రతినిధి సునీల్ వరాహలరావు, సర్వే శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరికి భీమా గడువు ఇక నాలుగు రోజులే...!

- మండల ఏఓ శివరామ ప్రసాద్ వెల్లడి



**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 12:** ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గడువు ఈ నెల 15 న ముగుస్తున్న నేపథ్యంలో ఈ ఖరీఫ్ సీజన్ లో వరి సాగు రైతులు పంటల బీమాలో నమోదు చేసుకోవటానికి చివరి అవకాశం గడువులోగా బీమా ప్రీమియం చెల్లించి పంట సాగుపై స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలని కొయ్యూరు మండల ఏ ఓ శివరామ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట రుణం తీసుకున్న రైతులు బ్యాంకు అధికారిని సంప్రదించి భీమా చేసుకోవాలని అలాగే మీ సేవా కేంద్రం నందు బీమా చేయించుకునే అవకాశం ఉన్నట్లు ఏ ఓ శివరామ ప్రసాద్ ఈ ప్రకటనలో తెలిపారు. కొయ్యూరు మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు ను అందజేసిన ప్రభుత్వ విప్.



**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 12 పెన్ పవర్.** మండల కేంద్రంలోని కురుపాం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నాడు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిఅందజేశారు. జియ్యమ్మవలస మండలం అంకవరం గ్రామానికి చెందిన మహంతి జయమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.20 వేల చెక్కును ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుతో మాట్లాడి ఆమె పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పేద,మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్స సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక రంగ అకాడమీ డైరెక్టర్ అంబటి రాంబాబు,మాజీ ఏఎంసి చైర్మన్ కోలా రంజిత్,ఎంపిటిసి సభ్యులు సింహాచలం,దామోదర్ రావు,తదితరులు ఉన్నారు.

## త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన వైసీపీ శ్రేణులు



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 12:**కుక్క కాటుకు గురై చికిత్స పొందుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గూడెంకొత్తవీధి మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబును వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం పరామర్శించారు. దామనపల్లి గ్రామపంచాయతీ దొడ్డికొండ గ్రామానికి చెందిన చంటిబాబు కుక్క కాటుకు గురైన విషయం తెలుసుకున్న పెదవలస, వంచుల గ్రామపంచాయతీలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు దొడ్డికొండలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అయనతో కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడి, ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వైద్యుల సూచనలను పాటిస్తూ మందులు క్రమం తప్పకుండా వాడాలని, పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకుని తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.చంటిబాబును పరామర్శించిన వారిలో వైసీపీ పాడేరు నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు వనపల రాజేష్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు లమ్మసింగి రమేష్, మండల ఉపాధ్యక్షుడు రిమెల బాలకృష్ణ, సీనియర్ నాయకులు కంకిపాటి శ్రీరాములు, దేశెట్టి రాంబాబు, పొత్తూరు గంగరాజు, వంతల ఆనంద్, పెదవలస గ్రామపంచాయతీ యువ నాయకుడు కంకిపాటి నవీన్ కుమార్ తదితరులు ఉన్నారు.

## 65 వ వార్డులో విస్తృతంగా ఇంటింటికి టిడిపి



**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు 12** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు అందించిన అభివృద్ధి సంక్షేమశీ, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ జీవీఎంసీ 65 వవార్డు వికాస్ నగర్లో ఇంటింటికి తెదేపా కార్యక్రమం విస్తృతంగా జరుగుతోంది.వార్డు మాజీ కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి చేపడుతున్న కృషిని ప్రజలకు వివరించారు.గత ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన నష్టంతో రాష్ట్రం అన్ని విధాలా వెనకబడిందని,కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రధాని మోదీ,సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ల సంయుక్త సారధ్యంలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తుందని తెలిపారు.ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని దీనిపట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు.కార్యక్రమంలో వార్డు అబ్జర్వర్ చెరుకూరి నాగేశ్వరరావు,వార్డు అధ్యక్షుడు రట్టి వాసు,చిన్నా,నక్కా భాస్కరరావు,కోరుకొండ మంగ,శ్రీలక్ష్మి,జయ,పద్మ,సంధ్య,జయంతి,ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## అనీమియా రహిత పాఠశాలలే లక్ష్యం జేసీ విద్యాధరి

- 12ఐ12 క్యాంపెయిన్‌ను పకడ్బందీగా అమలు చేయాలి
- 12 ఏళ్ల విద్యార్థుల్లో కనీసం 12 గ్రాముల హిమోగ్లోబిన్ ఉండేలా చర్యలు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 12 :** జిల్లాలోని పాఠశాల విద్యార్థులను రక్తహీనత నుంచి విముక్తి చేసి, డిసెంబర్ 2026 నాటికి జిల్లాను అనీమియా రహిత పాఠశాలల జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు సమ న్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యా ధరి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన స మావేశంలో '12ఐ12 క్యాంపెయిన్' అమలుపై ఆమె సమీక్షిం చారు.12 సంవత్సరాల వయస్సు గల ప్రతి విద్యార్థిలో కనీసం 12 గ్రాముల హిమోగ్లోబిన్ స్థాయి ఉండేలా చూడటమే 12ఐ1 2 క్యాంపెయిన్ ప్రధాన ఉద్దేశమని జేసీ తెలిపారు. జిల్లాలో ఇప్పటికే నిర్వహించిన తొలి విడత హిమోగ్లోబిన్ పరీక్షల్లో గణనీయ సంఖ్యలో విద్యార్థులు రక్తహీనతతో బాధపడు తున్నట్లు గుర్తించామని, ఈ సమస్యను అధిగమించేందుకు విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖలు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.రక్తహీనత తీవ్రతను బట్టి విద్యార్థులకు ఐరన్ మాత్రలను క్రమం తప్పకుండా అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి పాఠశాలలో చురుకైన విద్యార్థులను హెల్త్ అంబాసిడర్లుగా గుర్తించి కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు.ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న చిక్కీ, రాగిజావ వంటి పోషకాహార పదార్థాలను విద్యార్థులు తప్పనిసరిగా తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రక్తహీనత వల్ల కలిగే దుష్పరిణామాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు వైద్య, విద్యాశాఖ లు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

కౌమార బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జేసీ పేర్కొన్నారు. రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త లు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఐరన్ అవసరంపై మహిళా ఉపాధ్యాయులు విద్యార్థినులకు అవగాహన కల్పిం చాలని ఆదేశించారు. డిసెంబర్ 2026 నాటికి విశాఖపట్నం జిల్లాను అనీమియా రహిత పాఠశాలల జిల్లాగా తీర్చిదిద్దేందు కు అన్ని స్థాయిల్లో సమన్వయంతో పనిచేయాలని అధికారుల కు సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమకుమార్, ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు, మండల విద్యాశా ఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, కేజీహెచ్ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.వి. రమణ, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# వంటగ్యాస్ కోసం వినియోగదారులఇబ్బందులు...!





- పది రోజులకు ఒకసారి కూడా రాని గ్యాస్...
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు...
- గ్యాస్ గోడౌన్ కొయ్యూరులో ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం...
- బిజెపి నేత మేడి బోయిన చిన్న,సిపిఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ధన్యంరాజు కనకరాజు, తెదేపా ఎమ్మాకవరం గ్రామ కమిటీ చైర్మన్ కొర్రు పుల్లయ్య డిమాండ్...!

**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 12:** మండలానికి గ్యాస్ బండలు 15 రోజులకు ఒకసారి వస్తే గ్యాస్ వినియోగదారులు చాలక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మండల కేంద్రంలోని రాజేంద్రపాలెం, కొయ్యూరు, రేవళ్ల, మంప, సింగవరం కాకరపాడు, నడింపాలెం ఎమ్మాకవరం, చింతలపూడి, లొద్దిపాకలు, సింగరాలపాడు, గింజర్తి, తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గ్యాస్ కోసం రోజులు తరబడి నిరీక్షించవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రజా ప్రతినిధులు గానీ అధికారులు గానీ దీనిపై పట్టించుకోకపోవడం శోచనీయం. గిరిజనుల అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ఐటీడీఏకు గిరిజన ప్రాంతాల్లో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న వంటగ్యాస్ సమస్యలు కనిపించడం లేదా? అని బిజెపి నేత మేడి బోయిన చిన్న,సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ధన్యంరాజు కనకరాజు, టీడీపీ ఎం.మాకవరం గ్రామ కమిటీ చైర్మన్ కొర్రు పుల్లయ్య ప్రశ్నించారు.మండల కేంద్రంలో గ్యాస్ గోడౌన్ నిర్మించినా గిరిజన కుటుంబాలకు సకాలంలో గ్యాస్ అందకపోవడం దేనికి సంకేతమని వారు ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాల్లో గ్యాస్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పే అధికార యంత్రాంగం, వాస్తవంగా గిరిజన కుటుంబాలకు సిలిండర్లు అందుతున్నాయా? లేదా? అన్న విషయాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.అరకొర అక్షరాస్యతతో జీవిస్తున్న అనేక మంది గిరిజన కుటుంబాలకు మొబైల్ ఫోన్‌లో వచ్చే సమాచారం, ఓటీపీ చెప్పడం వంటి సాంకేతిక ప్రక్రియలు ఎంతవరకు సాధ్యమని వారు అన్నారు. సాంకేతికతను ప్రజల సౌకర్యం కోసం ఉపయోగించాలే తప్ప, అదే ప్రజలకు ఇబ్బందిగా మారేలా ఉండకూడదని అన్నారు.ఐదు, ఆరు సార్లు గ్యాస్ బుక్ చేసినా సిలిండర్ అందకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. గ్యాస్ కోసం రోజుల తరబడి ఎదురుచూస్తున్న సామాన్య గిరిజన కుటుంబాలు చివరకు కట్టెల పొయ్యిలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు ఆశ్రమ పాఠశాలలకు మాత్రం గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కనిపించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆశ్రమ పాఠశాలలకు నిరంతరం గ్యాస్ సరఫరా చేయగలిగినప్పుడు, అదే గిరిజన ప్రాంతంలోని సామాన్య కుటుంబాలకు సిలిండర్లు ఎందుకు అందడం లేదని చిన్న, ధన్యంరాజు కనకరాజు, కొర్రు పుల్లయ్య అన్నారు..మండల కేంద్రంలో గ్యాస్ గోడౌన్ నిర్మించడం తో సరిపోదని , దానిని వినియోగంలోకి తెచ్చి గ్యాస్ సరఫరా నిరంతరం కొనసాగిస్తేనే న్యాయం చేసినట్లు ఉంటుందని అన్నారు. గ్యాస్ బుకింగ్, ఓటీపీ, సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలను అధికారులు వెంటనే గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.గిరిజనుల అభివృద్ధి పేరుతో నిధులు ఖర్చు చేస్తున్న ఐటీడీఏ.. గిరిజనుల వంటింట్లో పొగ తగ్గించి గ్యాస్ మంట వెలిగించడంలో మాత్రం ఎందుకు విఫలమవుతోందని వారు ప్రశ్నించారు. ఇకనైనా జిల్లా యంత్రాంగం, ఐటీడీఏ అధికారులు స్పందించి గిరిజన కుటుంబాలకు సకాలంలో గ్యాస్ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని, మహిళలు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి తీసుకురావద్దని వారు తెలిపారు.

# 1373.73 కిలోల గంజాయి కేసు ఎ6 నిందితుడు అరెస్ట్

### జీ మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ లక్ష్మణరావు, స్థానిక ఎస్సై పీ నాని.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 12.**పరారీలో ఉన్న 1373.72 కిలోల గంజాయి కేసులో నిందితుడినీ అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు పోలీసులు అరెస్టు చేసినట్లు జీ మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఆయన బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జూలై 13న ఒడిస్సాలోని చిత్రకొండ బ్లాక్ నుండి అక్రమంగా 1373.72 కిలోల గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో ఎ6 నిందితుడుగా కృష్ణ రాజు ఉన్నాడు. ఒడిస్సాలోని కొర్రపుట్టు జిల్లా, పొట్టంగి బ్లాక్, పెద్దపాడుకు చెందిన గంజాయి నిందితుడు కృష్ణరాజును కుజబంగి జంక్షన్ వద్ద అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్ పీ అమిత్ బర్దార్ ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణపై ఉక్కుపాదం మోపుతున్నామని సిఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై పీ నాని, ఏఎస్ఐ లక్ష్మయ్య, పోలీసు సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




# గ్యాస్ వినియోగదారులకు ఇకపై గిరిజన సహకార సంస్థ డోర్ డెలివరీ చేస్తుంది.




చింతపల్లి తహసిల్దార్ హనుమంతు త్రివేణి.

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 12.** గ్యాస్ వినియోగదారులకు సిలిండర్లను గిరిజన సహకార సంస్థ డోర్ డెలివరీ చేస్తుందని స్థానిక తహసిల్దార్ హనుమంతు త్రివేణి తెలిపారు. బుధవారం ఆమె చౌడుపల్లి మార్కెట్ యార్డులోనున్న జిసిసి గ్యాస్ గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యాస్ సిలిండర్ల కోసం ఒకేసారి భారీ సంఖ్యలో వినియోగదారులు గోదాముకు రావడానికి ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిసిసి ఉద్యోగులు విలేకరులతో మాట్లాడుతూ గ్యాస్ వినియోగదారులకు సిలిండర్లు డోర్ డెలివరీ చేయాల్సిన బాధ్యత జిసిసి ఏజెన్సీ పై ఉందన్నారు. వినియోగదారులకు అవసరమైన గ్యాస్ నిలువలు ఉన్నాయని వినియోగదారులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. మండలంలోని వారానికి నాలుగు పంచాయితీలకు గ్యాస్ సిలిండర్లు జిసిసి ఉద్యోగుల వాహనాల్లో తీసుకుని వచ్చి వినియోగదారులకు అందజేస్తారన్నారు. భద్రతా కారణాల వల్ల గోదాములు సిలిండర్ల పంపిణీ నిలిపివేస్తున్నమన్నారు. గ్యాస్ కోసం గోదాములకు వినియోదారులు వచ్చిన సిలిండర్ల పంపిణీ చేసేది ఉండదని తెలిపారు. ప్రతి వినియోగదారుడు నాలుగు రోజులకు ఒకసారి సిలిండర్ను ఆన్లైన్లో బుక్ చేసుకోవాలి అన్నారు నిర్ణీత సమయంలో జిసిసి ఉద్యోగులు సిలిండర్లను డోర్ డెలివరీ చేస్తారన్నారు. అలాగే జిసిసి ఉద్యోగులు అనాధికారికంగా సిలిండర్లు పంపిణీ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సిలిండర్ల కోసం ఎవరు సిఫారసు చేసిన ఆన్లైన్ బుకింగ్ ఉంటేనే సిలిండర్ డెలివరీ చేయాలని ఒత్తిళ్లపై జిసిసి ఉద్యోగులు సహకరిస్తే చర్యలు తప్పవు అన్నారు. ఈ కార్యక్రమంలో జిసిసి గ్యాస్ గోదాం సూపరిండెంట్ శెట్టి చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలేశ్వరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం.

### వాతావరణ కాలుష్యం, మాదకద్రవ్యాలు వినియోగం సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి.

**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 12:** వాతావరణ కాలుష్యం, మాదకద్రవ్యాల వినియోగం నేటి సమాజాన్ని ముఖ్యంగా యువతను పట్టిపీడిస్తున్నాయని మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ డి. వీ.ఎస్. రాజు అన్నారు. స్థానిక సాయి శుభ ఫంక్షన్ హాల్ లో లైన్స్ క్లబ్ ఆఫ్ ఏలేశ్వరం బనానా ల్యాండ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్ పర్సన్ అనసూయ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ప్రమాణ స్వీకార మహోత్సవానికి డివిఎస్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వూర రాజబాబు, కార్యదర్శి గొల్లపూడి గణేష్ రామకృష్ణ, కోశాధికారి తండూరి రామారావు లోంచే డివీఎస్ రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. వీరితో పటు మరో 15 మంది క్లబ్ సభ్యులను నూతన కార్యవర్గానికి దుస్సాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. వీరితో పాటు ఎన్నికైన మరో 15 మంది క్లబ్ సభ్యులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డి వివిఎస్ రాజు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవ రంగాల్లో విశేష సేవలందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిందని కొనియాడారు. రానున్న భావితరానికి ప్లాస్టిక్ రహిత, మంచి పర్యావరణ పరిస్థితులను కల్పించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఇవ్వవలసిన బాధ్యత అందరికీ ఉందన్నారు.నూతన కార్యవర్గం కూడా అదే సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు మరింత చేరువయ్యే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. నసీబ ముక్తభారత్ అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక నినాదం ఇచ్చారు. దానినే నిదానంగా చూసుకొని పనిచేస్తుంది. లయన్స్ క్లబ్ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ప్లాస్టిక్ రహిత సమాజం గా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాలు నిర్మూలనకు యువతను చైతన్యవంతం చేసి కృషి చేయాలన్నారు. జోనల్ చైర్మన్ అనసూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం లయన్స్ క్లబ్ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని, దీనిలో భాగంగానే ఈ సంవత్సరం 6000 మొక్కలను నాటే కార్యక్రమం త్వరలో నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జి ఎల్ టి కోఆర్డినేటర్ కలిదిండి సత్యనారాయణ రాజు,జోనల్ చైర్ పర్సన్ అనుసూరి నాగేశ్వరరావు, రీజనల్ చైర్ పర్సన్ కే ఆర్ వి వి రమణ, పర్యావరణ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు, లయన్స్ క్లబ్ సభ్యులు జ్యోతుల నాగ శ్రీనివాస్,పర్వత జానకి దేవి, తాళ్లూరీ గొల్లజీరావు,కోట శ్రీనివాస్ చక్రవర్తి,గోళ్ళ నాగేశ్వరరావు,రౌతు సహదేవుడు,అలమండ వెంకట దుర్గా ప్రసాదు,నర్ల చిదంబరం, వూర నాని తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే ప్రభుత్వం.

- గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం.
- పూసలగరువు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



**హుకుంపేట పెన్ పవర్ ఆగస్టు. 12 :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం.


హుకుంపేటమండలంలోని ఓల్డా పంచాయతీ పరిధిలోని పూసలగరువు గ్రామంలో టీడీపి అరుకు అసెంబ్లీ ఎస్ టి సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ హుకుంపేట పెసా అధ్యక్షుడు చప్పలి శంకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గ్రామస్థులు పూసలగరువు గ్రామంలోని మంచినీటి సదుపాయం మరమ్మతు చేయాలని, ఓల్డా నుంచి పూసలగరువుకు బ్రిడ్జి నిర్మాణంతో పాటు తారు రోడ్డు సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్లు, అంగన్వాడీ భవనం, కమ్యూనిటీ హాల్, పాఠశాలకు ప్రహరీ గోడ, తాగునీటి సదుపాయం వంటి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామస్థులు తెలిపిన సమస్యలపై కిడారి శ్రావణ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలను దశలవారీగా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

అనంతరం అర్హులైన లబ్ధిదారులకు పట్టా పాస్‌బుక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థులకు వివరించారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేయడమే డోర్ టు డోర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కిడారి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ జ్ఞానప్రకాష్, ఎంపీటీసీ కొమ్మ రమ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సూర్యకాంతం, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సుబ్బారావు, మాజీ సర్పంచులు పాండురంగస్వామి, శశిభూషణ్ నాయుడు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు, పీసా సెక్రటరీ బాకా బొంజుబాబు, వార్డు నెంబర్ కాదేలి సంతోష్ కుమార్, టీడీపీ సెక్రటరీ నిక్కుల సుబ్బారావు, మత్స్యపురం పంచాయతీ టీడీపీ నాయకులు పెనుమాల అశోక్ కుమార్, కంబిడి కృష్ణారావు, కంబిడి నాగార్జున, రేగం మోహన్‌రావు, జనసేన నాయకులు బలోర్ద రామారావు, మాజీ సర్పంచ్ జి. మోహన్‌రావు, పెనుమాల కొండబాబు, ఓల్డా పీసా ఉపాధ్యక్షులు బలోర్ద కాంతారావు, పి. శివకుమార్, టీడీపీ నాయకులు బాకా సింహాచలం, బాకా శ్రీకాంత్, కంబిడి బాలు, నిక్కుల కోటేశ్వరరావు, నిక్కుల రామకృష్ణ, కంబిడి కాంతమ్మ, బలోర్ద జమ్మలమ్మ, కంబిడి సరోజి, పిట్ట జోగులు, ఆగతంబిడి నాగేశ్వరరావు, ఆగతంబిడి సత్యనారాయణ, నిక్కుల రావణమ్మ, పార్వతమ్మ, రేగం సోమన్న, రేగం రాంబాబు, పాడి రాంబాబు, సురకత్తి మధుబాబు, సాగర రామారావు, బలోర్ద సత్యం, నిక్కుల కొండబాబు, పెనుమాల శంకర్‌రావు, టీడీపీ సీనియర్ నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, మహిళలు, సచివాలయ సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## అన్ని విభాగాల అధిపతులతో మున్సిపల్ కమిషనర్ సమీక్ష సమావేశం



ప్రజా సేవల్లో మెరుగులు తేవాలని ఆదేశం

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 12:**మున్సిపల్ కమిషనర్ ఛాంబర్లో ఈరోజు అన్ని విభాగాల అధిపతులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నిన్న సీడీఎం ఏ సమావేశంలో చర్చించిన అంశాలను అధికారులకు వివరించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం యేసుబాబు గారు మాట్లాడుతూ ప్రజా సంబంధాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా

1. తాగునీరు సరఫరా
2. వీధి లైట్లు
3. రోడ్లు
4. రోడ్డు ఊడ్చడం
5. డ్రైనేజీ శుభ్రపరచడం


వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.

అన్న క్యాంటీన్ కమిటీ సమావేశంపై కూడా చర్చించారు. ఆహార నాణ్యత, సమయపాలన, పరిశుభ్రతపై నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రజలు, స్పాన్సర్లు పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, ప్రత్యేక సందర్భాలలో అన్న క్యాంటీన్ ద్వారా ప్రజలకు అన్నదానం చేయడానికి ముందుకు వస్తారని, వారికి పూర్తి సహకారం, సమాచారం అందించాలని తెలిపారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదుకు సిటిజన్ ఫోటోతో సహా లిఎండార్స్మెంట్ ఇచ్చి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మన మున్సిపాలిటీకి త్వరలో 15 ఈ ఆటోస్ మంజూరైనాయని, వాటి కోసం ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసే పనులు చేపట్టాలని కమిషనర్ గారు సూచించారు.

ఈ సమావేశంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కబడ్డీ, హాకీ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన నారాయణపురం జూనియర్ కళాశాల విద్యార్థులు





**పెన్ పవర్ -- ఉంగుటూరు, ఆగస్టు 12:**నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు కబడ్డీ, హాకీ క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్లకు ఎంపికయ్యారని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ శ్రీనివాసులు తెలిపారు.

అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ, జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బైపీసీ విద్యార్థి ఎ. రోహిత్ కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. సీఈసీ విద్యార్థిని టి. శివదుర్గ హాకీ జిల్లా జట్టులో చోటు దక్కించుకుంది.

త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ ఇద్దరు క్రీడాకారులు జిల్లా జట్ల తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి కళాశాలకు గర్వకారణంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి, బాధ్యత యుతం గా మెలిగి సమాజాభివృద్ధి కి దోహద పడాలి.







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 12.**మాదక ద్రవ్యాల అక్రమ వినియోగం పర్యవ శానాలు అనే అంశం పై ఈ రోజు ఆంగ్లో ఇండియన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, తాడేపల్లిగూడెం లో నిర్వహించిన కార్యక్రమం లో ఆమె ముఖ్య అతిథి గా పాల్గొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండి చదువు పై దృష్టిని సారించి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకుని కష్టపడి చదువుకుని వారి వారి లక్ష్యాలను చేరుకొని మంచి పేరు తెచ్చుకోవాలని శ్రీమతి స్వరాజ్యలక్ష్మి సూచించారు. గంజాయి తదితర మత్తు పదార్థా లకు అలవాటు పడితే కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఆర్థికం గా, శారీరకం గా, సామాజికం గా, మానసికం గా కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించి, వారికి వారి లక్ష్యాల పై దృష్టి సారించి ఉన్నత స్థితికి చేరుకొని వారికి వారికి కుటుంబ సభ్యులకు మంచి పేరు తెచ్చు కావాలని ఆమె సూచించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మత్తు పదార్థాలకు, డ్రగ్స్ కు ఆకర్షితులు కాకుండా ఉండాలని లేనియెడల వారి యొక్క ఉజ్వల భవిష్యత్తు నాశనమవుతుందని ఆమె తెలియజేశారు. ఈరోజు ఆమె డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలు మరియు సమాజంలో వారి యెడల కలిగే ఆ గౌరవం తదితర విషయాలపై ఆమె విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థుల చే మత్తు పదార్థాలను తీసుకోమని ప్రతిజ్ఞ చేశారు. ఈరోజు నిర్వహించిన అవగాహన సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయని జి. మల్లిక, ఉపాధ్యాయురాలు పి . సీతా, ఎక్సైజ్ ఎస్ ఐ ఆర్.దొరబాబు మరియు సిబ్బంది అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఉంగుటూరు విద్యార్థిని దీక్షిత ఎంపిక

**పెన్ పవర్ -- ఉంగుటూరు, ఆగస్టు 12**

అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల్లో భాగంగా జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని దీక్షిత ఎంపికైంది. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దా రాజా రవీంద్రకుమార్ బుధవారం వెల్లడించారు.

ఇటీవల నియోజకవర్గ, జిల్లా స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో దీక్షిత విశేష ప్రతిభ కనబరిచింది. ఆమె ప్రతిభను గుర్తించిన క్రీడా నిర్వాహకులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే ఏలూరు జిల్లా కబడ్డీ జట్టులో చోటు కల్పించారు.గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలతో పాటు ఉంగుటూరు ప్రాంతానికి గర్వకారణమని హెచ్ఎం రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దీక్షితను హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించి, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు



**జీలుగుమిల్లి, పెన్ పవర్, ఆగస్టు 12;** విద్యార్థులకు విద్యతోపాటు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం పై అవగాహన కలిగి ఉండాలని జీలుగుమిల్లి పిహెచ్సి వైద్యాధికారి మణికంతేశ్వర్ సూచించారు. బుధవారం జీలుగుమిల్లి పంచాయతీ పరిధిలో చంద్రమ్మ కాలనీ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగ్గు, జలుబు, జ్వరం వంటి పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మధ్యాహ్నం భోజనం నాణ్యత పరిశీలించి విద్యార్థులతో పాటు సహపంక్తి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలం కారణంగా గ్రామాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అప్పుడే వ్యాధులు దరి చేరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ యూనియన్ మండల అధ్యక్షులు కురం ప్రసాదు, సిహెచ్ఓ శ్రీనివాసరాజు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నానో ఎంటర్‌ప్రెన్యూర్లకు డిజిటల్ ఫైనాన్స్‌పై అవగాహన

- ప్రభుత్వ పథకాలు, పొదుపు, డిజిటల్ లాకర్‌పై అవగాహన






**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 12:**గంగవరం మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ ఫర్ ఎంఎస్ఎంఈ క్లస్టర్ ఆధ్వర్యంలో నానో ఎంటర్‌ప్రెన్యూర్లకు డిజిటల్ ఫైనాన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫౌండేషన్ ఫర్ ఎంఎస్ఎంఈ క్లస్టర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, మాస్టర్ ట్రైనర్ ఆకుల వెంకట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.మహీంద్రా ఫైనాన్స్ సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో ప్రభుత్వ పథకాలు, ఆర్థిక పొదుపు, డిజిటల్ లావాదేవీలు, డిజిటల్ లాకర్ వినియోగం, దాని ప్రాధాన్యత తదితర అంశాలపై నానో ఎంటర్‌ప్రెన్యూర్లకు అవగాహన కల్పించారు. చిన్న వ్యాపారాలు నిర్వహించే వారు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, తమ ఆర్థిక లావాదేవీలను సురక్షితంగా నిర్వహించేందుకు డిజిటల్ ఆర్థిక సేవలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.సదస్సులో పాల్గొన్న వారికి కార్యక్రమానికి సంబంధించిన సమాచార, అవగాహన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా డిజిటల్ ఫైనాన్స్ సేవలను వినియోగించే విధానం, పొదుపు ప్రాధాన్యతపై వివరించారు.కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఈ. సతీష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కుమారి, సీత తదితరులు పాల్గొన్నారు. మొత్తం 55 మంది నానో ఎంటర్‌ప్రెన్యూర్లు సదస్సులో పాల్గొని డిజిటల్ ఫైనాన్స్‌పై అవగాహన పొందారు.

# నా పైన, నా బంధువుల పైన వచ్చిన ఆరోపణలు అవాస్తవం

- మీడియా సమావేశంలో
- మాజీ సర్పంచ్ చంద్ర లీల ఖండన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు12:** ఈనెల 4వ తేదీన తనపైన, తన భర్త, బంధువుల పైన వదిన ఏడిద ప్రియదర్శిని ఆమె తల్లి, బంధువులు చేసిన ఆరోపణలు అవాస్తవమని సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామం మాజీ సర్పంచ్ ఇందుగమెల్లి చంద్ర లీల, ఆమె భర్త రామకృష్ణ ఖండించారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.

ఈ సందర్భంగా చంద్రలీల మాట్లాడుతూ, వదిన ఏడిద ప్రియదర్శిని ఆమె తల్లి సువార్తమ్మ, ఆమె సోదరుడు కోడె మోజేస్ బాబు పలువురు బంధువులు చేసిన ఆరోపణలు అవాస్తవాలన్నారు. తమ తండ్రి ఏడిద అబ్బులు విశాఖపట్నం ఎయిర్పోర్ట్ లో ఉద్యోగం చేసేవారని, ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారన్నారు. తమ అన్నయ్య దొరబాబుకి కోరుకొండ గ్రామానికి చెందిన తాతపూడి ప్రియదర్శినితో 2006 లో పెళ్లి జరిగిందన్నారు. వారు విశాఖపట్నంలో తండ్రి ఎయిర్పోర్టు క్వార్టర్స్ లో ఉండేవారన్నారు. 2018లో తండ్రి ఉద్యోగం నుంచి రిటైర్ అయినప్పుడు లక్షల్లోనే భారీ మొత్తం రాగా ఆ సొమ్మును అన్నయ్యకు దారాదత్తం చేశారన్నారు. 2020 లో తల్లి ఏడిద గంగారత్నం, 2021 లో అన్న దొరబాబు, 2023లో తండ్రి అబ్బులు చనిపోయా రన్నారు. కుటుంబంలో అమ్మ , అన్నయ్య చనిపోవడం వల్లను, కోడలు ప్రియదర్శిని తమ తండ్రి పై తప్పుడు అత్యాచార యత్నం కేసు పెట్టడంతో ఆయన తీవ్ర మనోవేదనకు గురయ్యార న్నారు. వృద్ధాప్యంలో గుండెజ బ్బులతో బాధపడుతూ, మరోపక్క ఆర్థికంగా ఇబ్బందులు పాలయ్యారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయన కున్న ఇల్లు,కొంత పొలం (భూమి) ఇతరులకు అమ్మి వేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారన్నారు.

దాంతో గ్రామ పెద్దల సూచనలతో ఆ ఇంటిని, పొలాన్ని తాను, తన చెల్లి స్వాతి 2021 లో కొనుక్కొని, రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నా మన్నారు. తండ్రి పేరు మీద ఏపీ 31 బి ఎన్ 2469 పి కారు కూడా ఉందన్నారు.

తమ ఆస్తి పై వదిన ప్రియదర్శిని రాజమండ్రి మొదటి సివిల్ జడ్జి కోర్టులో ఓ.ఎస్.నెంబర్ 114/2024 కేసు వేయడం జరిగింద న్నారు. ఆ కేసు ప్రస్తుతం కోర్టులో నడుస్తుందని, కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటుం మన్నారు. 2023 నుంచి తమ మధ్య గొడవలు జరుగుతుండగా 2026 ఏప్రిల్ నెల 30 న ప్రియదర్శిని, ఆమె మను షులతో తన ఇంటికి వచ్చి ఆస్తి కావ్వాలని అడగా, కోర్టులో కేసు వేశావు కదా మనం కోర్టులోనే తేల్చుకుందామని చెప్పానన్నారు. అప్పటి నుండి మూడు నెలల పాటు దౌర్జన్యంగా , బలవంతంగా పిల్లలతో కలిసి ప్రియదర్శిని తమ ఇంట్లోనే ఉండిపోయిం దన్నారు. తాను సీతానగరం పోలీస్ స్టేషన్లో ఐదుసార్లు కేసులు పెట్టగా, మీది సివిల్ తగదని జోక్యం చేసుకోలే మని పోలీసులు చెప్పార న్నారు. తాను లేని సమయాన్ని అదునుగా చేసుకొని ప్రియదర్శిని కుట్రతో, పథకం ప్రకారం తన ఇంటి సామాన్లు బయటికి విసిరేసి, ఆమె సామాన్లను లోపల పెట్టుకుందన్నారు. దీనిపై తాను, బంధువులు ఇదేంటని అడిగితే, ఇది నా ఇల్లని, అసభ్యంగా తిట్టి నన్ను జుట్టు పట్టి లాగి గట్టిగా ముష్టి దెబ్బలు కొట్టి బయటకు గెంటేశారన్నారు. తన ఆస్తిని అక్రమంగా స్వాధీనం చేసుకోవడానికి , ఏడిద ప్రియదర్శిని, ఆమె అనుచరులు తన ఇంటికి వచ్చి భౌతిక దాడులకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి నుంచి తనకు, కుటుంబానికి ప్రాణహాని ఉందని, పోలీసుశాఖ రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలోపసల పూడి గంగారత్నం, రాచర్ల వెంకటలక్ష్మి, బసల మరి రవికుమార్, వడ్డే బంగారమ్మ ,బసల విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల మానసిక వికాసానికి శిక్షణా తరగతులు దోహదం- ఎంఈవో వి. సాయిబాబా



**పెన్ పవర్, ఉంగుటూరు, ఆగస్టు 12:** అంగన్వాడీ కార్యకర్తలు శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ కేంద్రాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని ఉంగుటూరు ఎంఈవో-2 వి. సాయిబాబా అన్నారు. భీమడోలు ప్రాజెక్టు పరిధిలోని ఉంగుటూరు మండల అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు ఉంగుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రెండో రోజు కొనసాగాయి.

ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో కథలు, ఆటపాటలు వంటి సృజనాత్మక పద్ధతుల్లో బోధించడం ద్వారా చిన్నారుల్లో మానసిక, శారీరక పరిపక్వతతో పాటు సమగ్ర వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. శిక్షణలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు రూపొందించిన సృజనాత్మక చిత్రపటాలు ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దా రాజా రవీంద్రకుమార్, చేబ్రోలు సెక్టార్ సూపర్వైజర్ శారదామణి, వనరుల వ్యక్తులు లక్ష్మీనారాయణ, కూన కమల్‌కుమార్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఌ

# మెడికో ప్రియాంక కుటుంబానికి రూ.2 కోట్లు పరిహారం చెల్లించాలి




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 12:** మెడికో ప్రియాంక కేసు లో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, బాధిత కుటుంబానికి న్యాయం చేయకుండా కూటమి నాయకులు మాయమాటలు చెబుతు న్నారని కాంగ్రెస్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో బుధవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదని, రూ.2 కోట్ల రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసారు. ఈ ఘటనలో పోలీసుల నిర్లక్ష్యం ఖచ్చితంగా కనిపిస్తోందని, 3వ తేదీన ఘటన జరిగితే 6వ తేదీ వరకు ఎందుకు బయటికి రాకుండా చేసారో చెప్పాలని డిమాండ్ చేసారు. మెడికో ప్రియాంక మరణం చాలా బాధాకరమని, ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదం జరిగిన మాల్, పోలీస్ స్టేషన్ సీసీ టీవి ఫుటేజీలు ఉన్నా ఇంకా విచారణలో జాప్యం ఎందుకన్నారు. ఆ ఇద్దరు నిందితులపై హత్య కేసు నమోదు చేసారో లేదో ఎస్పీ ఎఫ్ఐఆర్ బయటపెట్టాలని డిమాండ్ చేసారు. బ్రాందీ షాపుల్ని బార్లుగా మార్చా రని, విచ్చలవిడిగా మద్యం సేవించే నేరస్తులకు ఆవాసాలుగా మారి పోయాయని ఆరోపించారు. నగరంలో చాలా చోట్ల సారా, మద్యం, గంజాయి, వ్యభిచార డెన్‌లపై పోలీసులు దృష్టి సారించడం లేదని విమర్శించారు. మద్యం, ఇసుక , భూ కబ్జాలు అక్రమ సంపాదనలో కూటమి నేతలు తలమునకలైరని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మేడవరపు భద్రశీదొర, డాక్టర్ రాజశేఖర్, తాడి సూరిబాబు, సింధియా రాణి, డాక్టర్ యాళ్ల వీరభద్రరావు, బర్రే సుబ్రహ్మణ్యం, సాకా పుల్లారావు, నిల్లా వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# 14న నగరం లో మోడల్ కెరీర్ సెంటర్లో జాబ్ మేళా

- జిల్లా ఉపాధి అధికారి: సి హెచ్ శిరీష



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 12:** తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అర్బన్ నియోజకవర్గంలోని ఉపాధి కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 9:00 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిహెచ్. శిరీష తెలిపారు.ఈ మేళాలో ప్రముఖ ఆపిల్ బ్రాడ్ బ్యాండ్ సర్వీస్ ప్రై . లి. ఠాగూర్ లాబ్స్ కంపెనీలలో పలు పోస్టల భర్తీకొరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని ఆమె తెలిపారు. పదవ తరగతి,ఇంటర్, ఐ టి ఐ, ఏదైనా డిగ్రీ, డిప్లొమా లేదా బీటెక్ పూర్తి చేసి అనుభవం ఉన్న లేదా ఆశక్తి గల 19 నుండి 40 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా లింక్ ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి, రెజ్యూమే, ఆధార్ సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరుకావాలని సూచించారు.

మరిన్ని వివరాలకు 9398318601 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ శిరీష తెలిపారు.

# సృజనాత్మక బోధనే జ్ఞానజ్యోతి లక్ష్యం



**పెన్ పవర్, ఉంగుటూరు, ఆగస్టు 12** అంగన్వాడీ కార్యకర్తలు శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్వాడీ కేంద్రాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని చేబ్రోలు సెక్టారు పర్యవేక్షకురాలు శారదామణి అన్నారు. భీమడోలు ప్రాజెక్టు పరిధిలోని ఉంగుటూరు మండలంలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు ఉంగుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రెండో రోజు కొనసాగాయి.

ఈ సందర్భంగా శారదామణి మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో కథలు, ఆటపాటలు తదితర సృజనాత్మక పద్ధతుల ద్వారా బోధించడం వల్ల చిన్నారుల్లో మానసిక, శారీరక పరిపక్వతతో పాటు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న నూతన బోధనా పద్ధతులను కార్యకర్తలు కేంద్రాల్లో ఆచరణలో పెట్టాలని సూచించారు.

ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు రూపొందించిన సృజనాత్మక చిత్రపటాలు ఆకట్టుకున్నాయి.

# నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేయాలి



- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 12:** నగరంలోని 9వ డివిజన్ ఏవీ అప్పారావు రోడ్డులో రూ.65 లక్షల అంచనా వ్యయంతో జరుగుతున్న ఇంటర్ లాకింగ్ పేవర్స్ పనులను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, పార్టీ నాయకులు, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. ఏవీ అప్పారావు రోడ్డులోని కోటసత్తెమ్మ గుడి నుంచి విద్యుత్ కాలనీ హైవే వరకు, లిటిల్ స్టార్స్ అండ్ షీ హాస్పిటల్ నుంచి రామాలయం జంక్షన్ వరకు, శ్రీనివాస గార్డెన్స్ నుంచి గంగోత్రి అపార్ట్మెంట్ వరకు రోడ్‌సైడ్ ఇంటర్ లాకింగ్ పేవర్స్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పనుల నాణ్యత, పేవర్స్ కింద ఏర్పాటు చేస్తున్న బేస్, సిమెంట్ బెడ్, ఇసుక పొర, డ్రైనేజీ కనెక్షన్లను ఎమ్మెల్యే వాసు పరిశీలించారు. పనుల నాణ్యత లో రాజీ పడకూడదని అధికారుల, కాంట్రాక్టర్‌లకు స్పష్టం చేశారు. పేవర్స్‌కు సరైన పునాది కీలకమని, నిబంధనల ప్రకారం బేస్ మెటీరియల్‌ను ఏర్పాటు చేయాలని, దీర్ఘకాలం మన్నేలా పనులు చేపట్టాలని సూచించారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. రోడ్డు పనులతో పాటు వర్షపు నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పార్టీ నాయకులు కాశీ నవీన్ కుమార్, కోసూరి చండిప్రియ, ఉప్పులూరి జానకి రామయ్య, కందికొండ అనంత్, నగరపాలక సంస్థ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు

# టిడిపి పార్టీ బలోపేతమే లక్ష్యం -- మండల స్థాయి సమావేశంలో



**సీతానగరం పెన్ పవర్, ఆగస్టు:12:** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ప్రతి నెల రెండో బుధవారం నిర్వహించే మండల స్థాయి సమావేశంలో భాగంగా మండలంలోని తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు గెడ్డం తిమ్మారావు , అధ్యక్షతన రాజనగరం నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ మరియు రుడా చైర్మన్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆదేశాల మేరకు బుధవారం నాడు ముగ్గళ్ళ గ్రామంలో క్లస్టర్ ఇన్చార్జిల సమావేశం నిర్వహించారు. ఇనగంటి వారి పేట క్లస్టర్ ఇన్చార్జి బిక్కిన సతీష్ 100% డోర్ టు డోర్ కార్యక్రమం పూర్తి చేయడంతో ఆయనను ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు గెడ్డం తిమ్మారావు మాట్లాడుతూ టిడిపి పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేయాలని కోరారు.ఈ సమావేశంలో మండల స్థాయి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు గోకవరం లో రెండో రోజు జ్ఞాన జ్యోతి ట్రైనింగ్



**గోకవరం పెన్ పవర్ ఆగస్టు 12:-** పిల్లలకు నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "జ్ఞాన జ్యోతి" కార్యక్రమం పై గోకవరం మండల స్థాయి ట్రైనింగ్ కార్యక్రమం దాసరి చిన ధర్మరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రెండో రోజు జరిగింది.కోరుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ ట్రైనింగ్ లో గోకవరం మండల పరిధిలోని అన్ని సెక్టార్ల అంగన్వాడీ వర్కర్లు, సహాయకురాళ్లు పాల్గొన్నారు.

ఎన్ ఈ ఎఫ్ - 2020 ప్రకారం 2026-27 నాటికి ప్రతి బిడ్డకు చదవడం మాట్లాడడం రాయడం లో వృద్ధి సాధించడమే లక్ష్యమని తెలిపారు. జ్ఞాన జ్యోతి ద్వారా అంగన్వాడీ కేంద్రాలను కేవలం పోషకాహార కేంద్రాలుగా కాకుండా బలమైన ప్రీ-ప్రైమరీ స్కూళ్లుగా మార్చాలని సూచించారు. ఆటల ద్వారా నేర్చుకోవడం, కథలు, పాటలు, టి ఎల్ ఎమ్ ల ఉపయోగం గురించి శిక్షణ ఇచ్చారు. 3 నుండి 6 సంవత్సరాల వయసు పిల్లల్లో భాషా నైపుణ్యాలు, గణిత పునాదులు, సామాజిక నైపుణ్యాలు పెంపొందించడంపై ప్రత్యేకంగా ఫోకస్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్లు, పలువురు అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com